PRGI NO: TGTEL/25/A2356

# మేకార్తి దినపత్రిక

సోమవారం 25-05-2026 | పేజీలు : 6 | వెల రు : 4/- | సంపుటి : 1 సంచిక : 263 | WWW.MEKARTHI DINAPATRIKA.COM

జర్నలిస్టులకు ఆహ్వానం
నూతనంగా ప్రారంభించిన
మేకార్తి దినపత్రిక పత్రికలో
అన్ని జిల్లాలలో స్టాఫర్లుగా,మండలాల్లో విలేకర్లుగా పనిచేయుటకు
జర్నలిస్టులు కావలెను
సంప్రదించాల్సిన నెంబర్స్
9014726022,6302041083

# ప్రధాని మోదీతో అమెరికా విదేశాంగ మంత్రి రూబియో భేటీ

- ప్రధాని మోదీతో అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో భేటీ
- సేవా తీర్థ్‌లో గంటకు పైగా కీలక చర్చలు
- భద్రత, వాణిజ్యం, సాంకేతిక రంగాలపై సహకారం పెంపు
- ఇండో-పసిఫిక్ వ్యూహంపై ఫలవంతమైన చర్చలు
- కోల్‌కతాలో మదర్ థెరీసాకు రూబియో నివాళులు
- మే 26న ఢిల్లీలో జరిగే క్వాడ్ సమావేశంలో పాల్గొననున్న రూబియో
- క్వాడ్‌లో భారత్, అమెరికా, జపాన్, ఆస్ట్రేలియా సభ్యదేశాలు



నాలుగు రోజుల పర్యటన నిమిత్తం భారత్‌కు చేరుకున్న అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో.. ప్రధాని మోదీ తో సమావేశమయ్యారు. సేవా తీర్థ్ (పీఎంవో)లో సుమారు గంటకు పైగా వీరి భేటీ కొనసాగినట్లు సమాచారం. భద్రత, వాణిజ్యం, కీలక సాంకేతిక రంగాల్లో ఇరు దేశాల సహకారాన్ని మరింత పెంపొందించడంపై చర్చలు జరిపినట్లు భారత్‌లో అమెరికా రాయబారి సెర్గియో గోర్ వెల్లడించారు. అంతేకాకుండా స్వేచ్ఛాయుత ఇండో-పసిఫిక్‌ను ముందుకు నడిపించే మార్గాలపైనా ఫలవంతమైన చర్చలు జరిపినట్లు పేర్కొన్నారు. పేజి 2లో ▶

# పదేళ్ల బాలిక హత్యోదంతం..

## స్పందించిన సీఎం విజయ్



మిగతాది 2లో

కోయంబత్తూర్ లోని దుకాణానికి వెళ్లి అదృశ్యమైన 10 ఏళ్ల బాలిక దారుణ హత్యకు గురైన ఘటన తమిళనాట కలకలం రేపింది. ఈ కేసులో పోలీసులు ఇప్పటికే కార్తీక్, మోహన్ రాజ్ అనే ఇద్దరు నిందితులను అరెస్ట్ చేశారు. ఈ ఘటనను తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్ తీవ్రంగా ఖండించారు. ఇలాంటి అమానవీయ చర్యలను సమాజం ఎన్నటికీ అంగీకరించబోదన్నారు.

# మోదీ గిఫ్ట్‌గా ఇచ్చిన తామరాకు టీ వెనక స్టోరీ తెలుసా?



ప్రధాని నరేంద్ర మోదీ ఇటీవల ఐదు దేశాల పర్యటనకు వెళ్లిన విషయం తెలిసిందే. మన దేశ సంస్కృతి, జీవనవిధానం, వారసత్వ సంపదను ప్రతిబింబించేలా ఆయా దేశాల అధినేతలకు కానుకలు ఇచ్చారు. వాటిలో లోక్‌తక్ లోటస్ టీ ఒకటి. ఈశాన్య రాష్ట్రమైన మణిపుర్‌లో ప్రత్యేకంగా తయారు చేసే ఈ టీ పౌడర్‌ను స్వీడన్ ప్రధాని ఉల్ఫ్ క్రిస్టెర్సన్‌కు కానుకగా అందజేశారు. పేజి 2లో ▶

# గోదావరి పుష్కరాలకు వేయికోట్లు

వచ్చే ఏడాది గోదావరి పుష్కరాల నేపథ్యంలో.. సంబంధిత పనులకు రూ.వెయ్యి కోట్ల కేటాయిస్తూ తెలంగాణ మంత్రివర్గం ఆమోదం తెలిపింది. తొలి విడతగా రూ.300 కోట్ల మంజూరుకు పచ్చజెండా ఊపింది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన క్యాబినెట్ భేటీలో పలు నిర్ణయాలు తీసుకున్నారు. జూనియర్ కళాశాలల్లోనూ మధ్యాహ్న భోజనం పథకం అమలుకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో అల్పాహారం, పాలు అందించాలని నిర్ణయించింది. అస్సాం రైఫిల్స్, బీఎస్ఎఫ్, సీఐఎస్ఎఫ్ సెంటర్ల ఏర్పాటుకు కరీంనగర్ జిల్లాను ఎంపిక చేసింది. కేసముద్రం ఫైర్‌స్టేషన్‌కు 18 పోస్టుల మంజూరుకు అంగీకారం తెలిపింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన తెలంగాణ కేబినెట్ శనివారం భేటీ అయ్యింది. రాష్ట్రానికి సంబంధించి పలు అంశాలపై మంత్రిమండలి చర్చించింది. ఈ సందర్భంగా కీలక నిర్ణయాలు తీసుకుంది. రాష్ట్రవ్యాప్తంగా జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజన పథకం అమలు చేసేందుకు క్యాబినెట్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. పాఠశాలలతో పాటు జూనియర్ కళాశాలల్లోనూ విద్యార్థులకు ఉదయం అల్పాహారం, పాలు అందించాలని మంత్రిమండలి నిర్ణయించింది. 2027 గోదావరి పుష్కరాల పనులకు రూ.1,000 కోట్లు కేటాయిస్తూ తెలంగాణ క్యాబినెట్ ఆమోదం తెలిపింది. తొలివిడతగా రూ.300 కోట్లు మంజూరుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. మరోవైపు నిరుద్యోగ యువతకూ మంత్రిమండలి గుడ్ న్యూస్ చెప్పింది. కరీంనగర్ జిల్లా గంగాధరలోని డిగ్రీ కళాశాలలో నియామకాలకు పచ్చజెండా ఊపింది. 20 రెగ్యులర్ టీచింగ్ పోస్టులు, 6 నాన్ టీచింగ్ పోస్టులు, అవుట్ సోర్సింగ్ పద్ధతిన మరో 3 పోస్టుల మంజూరుకు ఆమోదం తెలిపింది. మహబూబాబాద్ జిల్లా కె.సముద్రం అగ్నిమాపక కేంద్రానికి సంబంధించి 18 పోస్టులకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది.

జూనియర్ కాలేజీల్లో మహద్యాహ్న భోజనం
గంగాధర కాలేజీలో పోస్టుల భర్తీకి ఆమోదం
కేసముద్రం ఫైర్‌స్టేషన్‌కు 18 పోస్టుల మంజూరు
తెలంగాణ కెబినేట్కీలక నిర్ణయం



# 50 అత్యంత వేడి నగరాలు భారత్‌లోనివే



మిగతాది 2లో

- ప్రపంచంలో అత్యంత వేడి 50 నగరాలన్నీ భారత్‌లోనే నమోదు
- ఏక్యూఐ గణాంకాల్లో షాకింగ్ వివరాలు వెలుగులోకి
- జాబితాలో సగం నగరాలు ఉత్తర్‌ప్రదేశ్‌కే చెందినవి
- తెలంగాణ, ఆంధ్రా సహా పలు రాష్ట్రాల్లో ఉష్ణోగ్రతల ఉద్ధృతి
- రానున్న వారం రోజుల పాటు తీవ్ర వడగాలుల హెచ్చరిక
- తెలుగు రాష్ట్రాల్లోనూ ఎండల తీవ్రత మరింత పెరిగే అవకాశం
- ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఐఎండీ సూచనలు

## వర్షాకాలంలో బొగ్గు ఉత్పత్తికి విఘాతం కలగకుండా చూడాలి:



మిగతాది 2లో

## సీఏలు పన్నుల లెక్కలకే పరిమితం కాకూడదు:



హైదరాబాద్: చార్టర్డ్ అకౌంటెంట్లు కేవలం పన్నుల లెక్కలకే పరిమితం కాకూడదని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ అన్నారు. వ్యాపారాలను వృద్ధి చేసే సలహాదారులుగానూ ఎదగాలని ఆకాంక్షించారు. కృత్రిమ మేధను తమ వృత్తిలో భాగం చేసుకోవాలన్నారు.

మిగతాది 2లో

## పర్యాటక రంగ అభివృద్ధికి ప్రత్యేక చర్యలు: మంత్రి జూపల్లి



మిగతాది 2లో

## ఫ్యూచర్ సిటీపై హరీశ్‌రావు వ్యాఖ్యలు బాధ్యతారాహిత్యం: శ్రీధర్ బాబు



మిగతాది 2లో

# మున్సిపాలిటీల్లో "ఆపరేషన్ క్లీన్ స్వీప్" ప్రారంభం



- రాష్ట్రాన్ని పరిశుభ్రంగా, డంప్‌యార్డ్ రహితంగా మార్చడమే లక్ష్యం
- ప్రజలు, స్వచ్ఛంద సంస్థల భాగస్వామ్యంతో 4 వారాల పాటు నిర్వహణ
- విజయవాడలో బెలూన్లు ఎగురవేసి ప్రారంభించిన మంత్రి నారాయణ
- పారిశుధ్య కార్మికులతో కలిసి రోడ్లు ఊడ్చిన ప్రజాప్రతినిధులు
- భవిష్యత్తులో డంప్‌యార్డ్స్ లేకుండా ప్రభుత్వం ప్రత్యేక చర్యలు

మిగతాది 2లో

# సంపాదకీయం

## ముసుగులు తొలగిన మతతత్వం!

‘వారు నాకు ఓటు వేయలేదు. వారి బాగోగులకు నేను బాధ్యత వహించను’-- పశ్చిమ బెంగాల్ శాసనసభకు కొత్తగా ఎన్నికైన బీజేపీ ఎమ్మెల్యే రితేశ్ తివారీ అన్న మాటలవి. ఈ ఉద్ఘాటన మానవ ధర్మ ప్రేరితమేనా? ఒక్క క్షణం ఆలోచించండి. ఆ మాటల్లోని అనైతికత, దుర్మార్గం అర్థమవుతుంది. రాజ్యాంగబద్ధ ప్రజాస్వామ్య వ్యవస్థలో ఎన్నికైన ప్రజాప్రతినిధి అలా మాట్లాడవచ్చునా? పరిపాలన, పౌరసత్వ హక్కులు ఇప్పుడు మతపరమైన ఓటింగ్ సరళిపై ఆధారపడి ఉన్నాయని ఆ ప్రజాప్రతినిధి ప్రభావశీలంగా సూచించడమే కాదూ ఆ ప్రకటన? ముస్లింలు తనకు ఓటు వేయనప్పుడు తాను ప్రాతినిధ్యం వహించేందుకు వారు సరైన అర్హులు కారని ఆ బెంగాలీ ఎమ్మెల్యే ఆ మాటలతో చెప్పకనే చెప్పాడు.

రవీంద్రుడి ఆత్మ క్షోభించి ఉంటుంది. విశాల భారతావని ఆ మహాకవిని మరచిపోనట్లయితే కొత్త ‘ప్రజాప్రతినిధి’ కుత్సిత పలుకులకు భగ్గుమనేది కాదూ? అలా జరగలేదు! ఇదే, బహుశా, ఈ బెంగాల్ ముచ్చటలోని అత్యంత ఆందోళనకరమైన విషయం. వర్తమాన భారతదేశంలో నేడు మనం కంటున్నవీ వింటున్నవీ కేవలం మతతత్వ రాజకీయాలు కావు. అవి ఇంతకు ముందు కూడా ఉన్నాయి. ఇప్పుడు మనం చూస్తోంది మతతత్వ రాజకీయాల సర్వవ్యాపకత్వం. అవును, అవి సర్వసాధారణమైపోయాయి. ఆ బెంగాలీ అన్న మాటలను గతంలో ఎవరైనా వదరి ఉంటే వారి రాజకీయ జీవితాలకు అవి భరతవాక్యాలు అయివుండేవి. అయితే ఇప్పుడు అవి కేవలం ఎన్నికల ప్రలాపమని, పట్టించుకోవల్సినంత ముఖ్యమైనవి ఏ మాత్రం కావని కొట్టివేస్తున్నారు!

మత ప్రాతిపదికన ప్రజలను సమీకరించేందుకు రాజకీయులు ఇంకెంత మాత్రం సంకోచించడం లేదు. గతంలో గోప్యంగా చేసిన ఆ పనిని ఇప్పుడు బాహాటంగా అడ్డూ అదుపులేని రీతిలో నిస్సంకోచంగా చేస్తున్నారు. అందుకే కాబోలు భారత జాతీయ కాంగ్రెస్‌ను ‘కొత్త ముస్లిం లీగ్’ అని కేంద్ర మంత్రి కిరెన్ రిజిజు అభివర్ణించారు. రిజిజు వ్యాఖ్య వెనుక ఉన్న వాదన ఏమిటో నిశితంగా చూద్దాం. అసోం, బెంగాల్ ఎన్నికల్లో గెలిచిన కాంగ్రెస్ అభ్యర్థులు అందరూ దాదాపుగా ముస్లిం అభ్యర్థులే అయినందున కాంగ్రెస్ ఒక మతతత్వ పార్టీగా పరిణమించింది. అవును, అసోంలో ఎన్నికైన 19 మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలలో 18 మంది ముస్లింలే. అలాగే బెంగాల్‌లో గెలిచిన కాంగ్రెస్ అభ్యర్థులు ఇరువురూ ముస్లింలే. సరే, కేరళలో కాంగ్రెస్ మిత్రపక్షం ఇండియన్ యూనియన్ ముస్లిం లీగ్ ఎన్నికల్లో జయాపజయాలను ప్రభావశీలంగా నిర్ణయించే రాజకీయ శక్తి. అయితే కాంగ్రెస్‌ను మతతత్వ పార్టీగా నిందిస్తున్నవారు ఒక వాస్తవాన్ని విస్మరిస్తున్నారు. దేశవ్యాప్తంగా కాంగ్రెస్‌కు 650 మంది ఎమ్మెల్యేలు ఉన్నారు. వారిలో అత్యధికులు ముస్లిమేతరులే. అయినప్పుడు కాంగ్రెస్ మతతత్వ పార్టీ ఎలా అయింది?ఆ ప్రశ్నకు సమాధానం అంక గణితంలో కాకుండా రాజకీయ సందేశం-- ప్రజాభిప్రాయాన్ని ప్రభావితం చేసేందుకు చేసే ప్రసంగాలు, ప్రకటనలు సామాజిక మాధ్యమాల్లో జరిగే ప్రచారం-- లో ఉన్నది. ముస్లింల రాజకీయ ప్రాతినిధ్యాన్ని అనుమానాస్పదం చేయడమే అసలు లక్ష్యం. ప్రధానస్రవంతి ప్రతిపక్ష పార్టీ అభ్యర్థులుగా ముస్లిం అభ్యర్థులు చెప్పుకోదగిన సంఖ్యలో ఎన్నికైనప్పుడు సదరు పార్టీపై మతతత్వ పార్టీ అనే ముద్ర వేయడమే అటువంటి వ్యాఖ్యలు చేసేవారి అభీష్టం. మైనారిటీ వర్గాల ప్రాతినిధ్యాన్ని చట్టవిరుద్ధం చేయడం, మెజారిటీ వర్గ ఆధిపత్యాన్ని జాతీయ వాదంగా చూపడమే రిజిజు వ్యాఖ్య పరమార్థం. ఈ రాజకీయ విలోమం చాలా చాలా ప్రమాదకరమైనది. బెంగాల్‌లో సువేందు అధికారి పోలింగ్ కేంద్రాల వద్ద బారులు తీరిన హిందువులకు బీజేపీకి ఓటువేయమని బహిరంగంగా విజ్ఞప్తి చేశారు. గెలిచిన తరువాత వారికి కృతజ్ఞతలు తెలియజేశారు. ఇదే ఏ ప్రతిపక్ష నాయకుడు అయినా పోలింగ్ కేంద్రాల వద్ద బారులు తీరిన ముస్లిం ఓటర్లకు తమ పార్టీకి ఓటువేయమని విజ్ఞప్తి చేసి ఉంటే ఏమయివుండేది?లౌకికవాదాన్ని పరిరక్షించాల్సిన బాధ్యత హిందువులపైనే ఎందుకు మోపుతున్నారని పలువురు తరచు ప్రశ్నిస్తున్నారు. ముస్లిం ఓటర్లు ప్రధానంగా ముస్లిం అభ్యర్థులకే ఎందుకు ఓటు వేస్తున్నారు? ముస్లిం ఓటర్లు అత్యధికంగా ఉన్న నియోజకవర్గం నుంచి హిందూ అభ్యర్థి విజయం సాధించగలడా? ఇవి న్యాయబద్ధమైన ప్రశ్నలే. వీటికి సమాధానం ఒక రాజకీయ వాస్తవాన్ని గుర్తించడంలో ఉన్నది: భారత జనాభాలో హిందువులు 80శాతంగా ఉన్నారు. పరిపూర్ణ భద్రతా భావంతో నిండు ఆత్మ విశ్వాసంతో ఉన్న మెజారిటీ హిందువులు మాత్రమే దేశం మెజారిటేరియన్ జాతీయవాదంలోకి జారిపోకుండా నివారించగలరు.సరే, లౌకికవాదం బలహీనపడడం బీజేపీతో మాత్రమే ఆరంభమయిందా? అలా భావించడం, ఆ సంక్షోభానికి ఆ పార్టీనే తప్పుపట్టడమంటే ఆత్మ వంచన చేసుకోవడమే అవుతుంది. లౌకికవాద పార్టీలుగా పరిగణన పొందుతున్న రాజకీయ పక్షాలు రెండు చారిత్రక తప్పిదాలకు పాల్పడ్డాయి. ముస్లింల సామాజిక పురోగతి, ఆర్థికాభ్యుదయానికి చిత్తశుద్ధితో కృషి చేయకుండా వారిని తమ ఫిక్స్‌డ్ డిపాజిట్ ఓటు బ్యాంకుగా చూడడం మొదటి చారిత్రక నేరం. మితవాద ముస్లిం మతాచార్యుల ఒత్తిడికి లొంగిపోయి షాబానో కేసు తీర్పును కాంగ్రెస్ ప్రభుత్వం రద్దు చేయడమైనా, లేదా ప్రాంతీయ పార్టీలు తమ ప్రతీకాత్మక రాజకీయాల ద్వారా ముస్లింల అభద్రతా భావాన్ని స్వార్థ ప్రయోజనాలకు ఉపయోగించుకోవడమైనా ముస్లింలకు తరచు పంపుతున్న సందేశం: మాకు ఓటు వేయండి. మిమ్మలను హిందూ మితవాదుల నుంచి సంరక్షిస్తాం. సంరక్షణ రాజకీయంగా మారింది. అయితే సాధికారత అరుదుగా లభించింది.లౌకికవాద పార్టీలు పాల్పడిన రెండో చారిత్రక తప్పిదం కూడా మొదటిదాని వలే లౌకికవాద విలువలకు తీవ్ర నష్టం చేసింది. హిందూ ఓట్లను బీజేపీకి కోల్పోతామనే భయంలో లౌకికవాదాన్ని దృఢవిశ్వాసంతో పరిరక్షించడానికి బదులుగా మృదు హిందుత్వను పాటించడంలో ఉత్సాహం చూపాయి. తద్వారా బీజేపీని సమర్థంగా ఎదుర్కోగలమని విశ్వసించాయి. 1980ల్లో రాజీవ్‌గాంధీ ప్రభుత్వం బాబ్రీమసీదుకు దశాబ్దాలుగా వేసి ఉన్న తాళాలను తెరవడాన్ని గుర్తు చేసుకోండి. అలాగే 2017లో గుజరాత్ అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో రాహుల్‌గాంధీ సందర్శించని హిందూ దేవాలయం ఏదైనా ఉన్నదా? లౌకికవాద పార్టీలు ఎప్పుడైతే మృదు హిందూత్వను పాటించడంలో నిమగ్నమయ్యాయో అప్పుడే మతవాద భావజాలానికి రాజకీయ ఆమోదం లభించేందుకు అనుద్దేశపూర్వకంగా తోడ్పడ్డాయి. దీనికి తోడుగా అస్తిత్వ రాజకీయాలు ప్రబలమయ్యాయి. ముస్లింలకు మరింత అధికంగా రాజకీయ ప్రాతినిధ్యం, వారు ఎదుర్కొంటున్న సామాజిక సమస్యలు మొదలైన అంశాల ప్రాతిపదికన అసదుద్దీన్ ఓవైసీ తదితర ముస్లిం నాయకులు అస్తిత్వ రాజకీయాలను బలోపేతం చేశారు. మృదు హిందుత్వ, అస్తిత్వ రాజకీయాలు ఒక విషవలయమై మున్నెన్నడూ లేని ప్రమాదకర పరిస్థితికి దారితీశాయి. హిందూ మెజారిటీవాద రాజకీయ ప్రలాపాలు ముస్లింలలో అభద్రతా భావాన్ని పెంపొందించాయి. ఈ అభద్రత ముస్లిం అస్తిత్వ రాజకీయాలను బలోపేతం చేశాయి. తీవ్రవాద ముస్లిం రాజకీయాలు హిందువుల్లో భయాందోళనలు సృష్టించి మితవాద, మతవాద భావజాలాలవైపు మొగ్గేలా చేశాయి.ఇదిలా వుండగా రాజ్యాంగ బద్ధ పాలన కుంచించుకుపోవడం అంటే రాజ్యాంగ సంస్థలు బలహీనపడడం, సమాఖ్య పాలనా పద్ధతులు క్షీణించడం, ప్రజాస్వామ్య నియమాల ఉల్లంఘన ఆరంభమయింది. రాజకీయ ఆమోదయోగ్యతను మతపరమైన గుర్తింపు నిర్ణయించడమే ఆ విపత్కర మార్పుకొక నిదర్శనం. దశాబ్దాల క్రితం ఎ.ఆర్. అంతూలే మహారాష్ట్ర ముఖ్యమంత్రి అయ్యారు. హిందూ ఓటర్లు అత్యధికంగా ఉన్న కాన్పూర్ నుంచి 1989లో కాంగ్రెస్ అభ్యర్థిగా అరిఫ్ మహమ్మద్ ఖాన్ గెలుపొందారు. ఇప్పుడు అటువంటి విజయాలను ఊహించగలమా? 20 కోట్ల మందికి పైగా ముస్లింలు ఉన్న భారత్‌లో ఒక్క రాష్ట్రానికి సైతం ముస్లిం ముఖ్యమంత్రి లేడు; 18 రాష్ట్రాలలో ముస్లిం మంత్రి ఒక్కరంటే ఒక్కరూ లేరు; బెంగాల్‌లో మూడింట రెండు వంతుల మెజారిటీతో విజయం సాధించిన బీజేపీ ఎమ్మెల్యేలలో ఒక్క ముస్లిం కూడా లేడు; పన్నెండేళ్లుగా కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ తరపున లోక్‌సభకు ఎన్నికైన ముస్లిం ఎంపీ ఒక్కరూ లేరు.హిందూత్వ అప్రతిహత పురోగతి మూలంగా రాజకీయ భారతంలో ముస్లింలు ఉనికిని దాదాపుగా కోల్పోయినట్టుగా కనిపిస్తోంది. ఒక మత వర్గాన్ని ప్రధానస్రవంతి రాజకీయాల నుంచి మినహాయిస్తే ‘సబ్ కా సాథ్, సబ్ కా వికాస్’ (అందరి సహకారంతో అందరి అభివృద్ధి) అనే పాలనా ఆదర్శం ఎలా సాకారమవుతుంది? ఇవి ఇబ్బందికరమైన ప్రశ్నలు. అయితే పాలకులకు

## మున్సిపాలిటీల్లో “ఆపరేషన్ క్లీన్ స్వీప్” ప్రారంభం

మొదటిపేజీ తరువాయి



రాష్ట్రాన్ని పరిశుభ్రంగా, డంప్‌యార్డ్ రహితంగా తీర్చిదిద్దే లక్ష్యంతో మున్సిపల్ వ్యవహారాల శాఖ నాలుగు వారాల ప్రత్యేక స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని అమలు చేస్తోందని మంత్రి పొంగూరు నారాయణ తెలిపారు. విజయవాడ కూర్మయ్య బ్రిడ్జి వద్ద నిర్వహించిన “ఆపరేషన్ క్లీన్ స్వీప్” కార్యక్రమాన్ని ఎమ్మెల్యే బోండా ఉమామహేశ్వరరావు, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ పట్టాభిరామ్, కలెక్టర్ లక్ష్మీశతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా పారిశుధ్య కార్మికులతో కలిసి మంత్రి రోడ్లు ఊడ్చారు. ప్రజల్లో పరిశుభ్రతపై అవగాహన పెంపొందించేందుకు రాష్ట్ర వ్యాప్తంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

**నాలుగు వారాల కార్యాచరణ ప్రణాళిక**

ఈ కార్యక్రమంలో మొదటి వారంలో రోడ్లు, పబ్లిక్ ప్రదేశాల శుభ్రత చేపడతారని మంత్రి నారాయణ తెలిపారు. రెండో వారంలో కాలువల క్లీనింగ్, మూడో వారంలో చెత్త వర్గీకరణపై అవగాహన, నాలుగో వారంలో పబ్లిక్ టాయిలెట్స్ శుభ్రత నిర్వహిస్తారని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు గత ప్రభుత్వం వదిలేసిన లెగసీ వ్యర్థాలను రికార్డు స్థాయిలో తొలగించామని, మిగిలిన భూగర్భ చెత్తను వచ్చే జూన్ నాటికి క్లియర్ చేస్తామని చెప్పారు. రాష్ట్రంలో చెత్తను విద్యుత్‌గా మార్చే వేస్ట్ టు ఎనర్జీ ప్రాజెక్టులకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు.

**ప్రజల భాగస్వామ్యంతోనే స్వచ్ఛాంధ్ర సాధ్యం**

స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ పట్టాభిరామ్ మాట్లాడుతూ, ఆంధ్రప్రదేశ్‌ను పరిశుభ్రతలో దేశానికి ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. ఎనిమిది వేస్ట్ టు ఎనర్జీ ప్లాంట్లు, 107 వేస్ట్ ప్రాసెసింగ్ సెంటర్ల ఏర్పాటుకు చర్యలు చేపట్టామన్నారు. డోర్ టు డోర్ చెత్త సేకరణ కోసం 2000 ఎలక్ట్రిక్ వాహనాలను వినియోగంలోకి తీసుకువచ్చామని పేర్కొన్నారు. గత సంవత్సరం స్వచ్ఛ సర్వేక్షణ్ అవార్డుల్లో రాష్ట్రానికి ఐదు అవార్డులు లభించాయని, ఈసారి మరింత మెరుగైన ఫలితాలు సాధిస్తామని ధీమా వ్యక్తం చేశారు.

**నగర పరిశుభ్రత అందరి బాధ్యత**

మున్సిపల్ శాఖ ముఖ్య కార్యదర్శి సురేష్ కుమార్, ఎమ్మెల్యే బోండా ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ, నగర పరిశుభ్రత కేవలం పారిశుధ్య కార్మికుల బాధ్యత మాత్రమే కాదని, ప్రజలందరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. వ్యాపారులు, స్వచ్ఛంద సంస్థలు, యువత పరిశుభ్రత కార్యక్రమాల్లో పాల్గొనాలని కోరారు. చెత్తను రోడ్లపై, కాలువల్లో వేయకుండా డస్ట్ బిన్లలో వేయాలని సూచించారు. స్వచ్ఛాంధ్ర ద్వారా ప్రజల ఆరోగ్యం మెరుగుపడి రాష్ట్ర అభివృద్ధికి దోహదపడుతుందని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, నగరపాలక సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.

## ఫ్యూచర్ సిటీపై హరీశ్‌రావు వ్యాఖ్యలు బాధ్యతారాహిత్యం: శ్రీధర్ బాబు

మొదటిపేజీ తరువాయి

హైదరాబాద్: ఫ్యూచర్ సిటీని రద్దు చేస్తామని బీఆర్ఎస్ నేత హరీశ్‌రావు బాధ్యతారాహిత్యంగా మాట్లాడుతున్నారని మంత్రి శ్రీధర్‌బాబు విమర్శించారు. రాష్ట్రాన్ని అభివృద్ధి చేయాలా? వద్దా? ఆయన చెప్పాలన్నారు. “ఇలా చేస్తే పెట్టుబడులు రావు. పక్క రాష్ట్రాలకు వెళ్తాయి. ఫ్యూచర్ సిటీలో కాలుష్యకారక పరిశ్రమలు ఉండవు. దాన్ని రద్దు చేస్తామనడం ఎంత వరకు సమంజసం?” అని ప్రశ్నించారు.తమ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని బీఆర్ఎస్ అడ్డుకుంటోందని మంత్రి ఆరోపించారు. ఆ పార్టీ బ్లాక్‌మెయిలింగ్ రాజకీయాలకు యత్నిస్తోందన్నారు. ప్రభుత్వం ఏర్పడిన మొదటిరోజు నుంచే బీఆర్ఎస్ నేతలు విమర్శలే ప్రధాన అంశంగా ముందుకెళ్తున్నారని తెలిపారు. జంట నగరాలకు సంబంధించిన మెట్రోను విస్తరించాలనుకుంటే అడ్డుకుంటున్నారని ఆరోపించారు.

## పర్యాటక రంగ అభివృద్ధికి ప్రత్యేక చర్యలు: మంత్రి జూపల్లి

మొదటిపేజీ తరువాయి

గచ్చిబౌలి: తెలంగాణను పర్యాటకుల గమ్యస్థానంగా మార్చడమే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు మంత్రి జూపల్లి కృష్ణారావు తెలిపారు. ఇందుకోసం ప్రత్యేక ప్రణాళికతో ముందుకు సాగుతున్నట్లు చెప్పారు. పర్యాటక రంగమంటే కేవలం వినోదం మాత్రమే కాదని.. దేశ, రాష్ట్ర ఆర్థిక ముఖచిత్రాన్ని మార్చే అద్భుత శక్తి అని పేర్కొన్నారు. గచ్చిబౌలిలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టూరిజం అండ్ హాస్పిటాలిటీ మేనేజ్‌మెంట్ (నితం)లో ‘డెస్టినేషన్ తెలంగాణ – రోడ్ అహెడ్’ పేరిట నిర్వహించిన ప్రత్యేక సదస్సుకు ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు.“రాష్ట్రంలో పర్యాటక రంగ అభివృద్ధికి ప్రైవేటు భాగస్వామ్యం అత్యంత కీలకం. పారిశ్రామికవేత్తలు కొత్త ఆవిష్కరణలు, సృజనాత్మక ప్రతిపాదనలతో ప్రభుత్వం వద్దకు రావాలి. పర్యాటక రంగంలో పెట్టుబడులు పెట్టే సంస్థలకు ప్రభుత్వం తరపున పూర్తి సహకారం ఉంటుంది. ప్రభుత్వ పరిధిలోని నిరర్థక ఆస్తులను పర్యాటక ప్రాజెక్టుల నిర్వహణకు దీర్ఘకాలిక లీజుకు ఇచ్చేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉంది. ఎంపిక చేసిన పర్యాటక ప్రాంతాల అభివృద్ధికి త్వరలోనే ‘ఎక్స్‌ప్రెషన్ ఆఫ్ ఇంట్రెస్ట్’ ప్రకటనలు జారీ చేస్తాం. దీని ద్వారా ఎంపికయ్యే సంస్థలకు సంబంధించిన డిజైన్లు, ప్రాజెక్టుల వ్యయాన్ని ప్రభుత్వమే భరిస్తుంది. పర్యాటక ప్రాంతాల్లో తాగునీరు, టాయిలెట్లు, వసతి గృహాల వంటి సమస్యలను అధిగమించేందుకు ప్రైవేటు వ్యక్తులు ముందుకు రావాలి” అని మంత్రి జూపల్లి పిలుపునిచ్చారు.

## సీఏలు పన్నుల లెక్కలకే పరిమితం కాకూడదు:

మొదటిపేజీ తరువాయి



గచ్చిబౌలిలో ‘ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ చార్టర్డ్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా’ స్నాతకోత్సవ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. భవిష్యత్తులో వ్యాపార అవకాశాల్లో సీఏల పాత్ర అత్యంత కీలకమని.. ట్యాక్స్‌లు, జీఎస్టీ, వ్యాపారాల విస్తరణలో వారి అవసరం చాలా ఉందన్నారు. సీఏలో ప్రతిభ కనబర్చిన విద్యార్థులను ఆయన సత్కరించారు. విద్యార్థులు తమ తల్లిదండ్రుల త్యాగాలను, కష్టాన్ని ఎప్పటికీ మరువకూడదని.. వారిని ఎల్లప్పుడూ గౌరవించాలని సూచించారు.

## ప్రధాని మోదీతో అమెరికా విదేశాంగ మంత్రి రూబియో భేటీ

మొదటిపేజీ తరువాయి

శనివారం ఉదయం అమెరికా నుంచి నేరుగా కోల్‌కతా చేరుకున్న రూబియో.. మదర్ థెరీసా స్థాపించిన మిషనరీస్ ఆఫ్ ఛారిటీని సందర్శించారు. సతీమణి జీనెట్‌తో కలిసి అక్కడికి వెళ్లిన ఆయన థెరీసాకు నివాళులర్పించారు. అనంతరం ఆమె సేవా తత్వాన్ని కొనియాడుతూ ‘ఎక్స్’ వేదికగా పోస్ట్ చేశారు. భారత్ పర్యటనలో భాగంగా మే 26న దిల్లీలో జరగనున్న క్వాడ్ (ఁఖబఎ) కూటమి విదేశాంగ మంత్రుల సమావేశంలో రూబియో పాల్గొననున్నారు. ఈ కూటమిలో భారత్ సహా ఆస్ట్రేలియా, జపాన్, అమెరికాలు భాగస్వాములుగా ఉన్న సంగతి తెలిసిందే.

## పదేళ్ల బాలిక హత్యోదంతం..

మొదటిపేజీ తరువాయి

ఈ కేసులో త్వరిత గతిన దర్యాప్తు పూర్తి చేసి, నిందితులకు కఠిన శిక్ష పడేలా చేస్తామని హామీ ఇచ్చారు. టీవీకే ఎమ్మెల్యే ఎన్ఎం కుమార్ ఆసుపత్రి వద్ద బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. నిందితులపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

**రాజకీయంగా దుమారం..**

చిన్నారి హత్య ఘటన రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర దుమారం రేపింది. కొత్త ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 12 రోజుల్లోనే రాష్ట్రంలో నేరాల గ్రాఫ్ పెరిగిందని డీఎంకే విమర్శలు గుప్పించింది. ఈ ఘటన రాష్ట్రంలోని శాంతిభద్రతలపై తీవ్ర సందేహాలను రేకెత్తిస్తోందని ప్రతిపక్ష నేత ఉదయనిధి స్టాలిన్ అన్నారు. బాలిక హత్యకు బాధ్యులైనవారిని వీలైనంత త్వరగా న్యాయస్థానం ముందు నిలబెట్టి.. కఠిన శిక్ష విధించాలని డిమాండ్ చేశారు. మహిళలకు భద్రత కల్పిస్తామని హామీ ఇచ్చి విజయ్ అధికారంలోకి వచ్చారని.. ఇప్పుడు వారికి భద్రత ఎక్కడుందని ప్రశ్నించారు.

ఈ ఘటనపై భాజపా నేత నారాయణన్ తిరుపతి మాట్లాడుతూ.. ఎంకే స్టాలిన్ నేతృత్వంలోని గత ప్రభుత్వం రాష్ట్రంలో శాంతిభద్రతలను పూర్తిగా నాశనం చేసిందని దుయ్యబట్టారు. ప్రభుత్వాలు మారుతున్నప్పటికీ ఇలాంటి ఘటనలు చోటుచేసుకుంటూనే ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. కోయంబత్తూర్‌లోని కణ్ణపాళైయానికి చెందిన 10 ఏళ్ల బాలిక గురువారం సాయంత్రం దుకాణానికి వెళ్లి అదృశ్యమైంది. తల్లిదండ్రులు పలుచోట్ల వెతికినా ఆచూకీ లభ్యంకాలేదు. శుక్రవారం ఓ చెరువులో బాలిక మృతదేహాన్ని పోలీసులు గుర్తించారు. ఓ వ్యక్తి బాలికను బైక్‌పై ఎక్కించుకొని వెళ్లినట్లు విచారణలో తేలడంతో అతడితో పాటు మరో అనుమానితుడిని అరెస్ట్ చేసి విచారిస్తున్నారు.

## మోదీ గిఫ్ట్‌గా ఇచ్చిన తామరాకు టీ వెనక స్టోరీ తెలుసా?

మొదటిపేజీ తరువాయి

సాధారణంగా ప్రపంచస్థాయి నేతలు ఖరీదైన కానుకలను ఇచ్చిపుచ్చుకుంటారు. అయితే మోదీ మాత్రం మణిపుర్‌లోని కొండలు, చిత్తడి నేలల నుంచి సేకరించిన టీపొడిని ఇవ్వడం విశేషం. లోక్‌తక్ లేక్.. ఈశాన్య భారతంలోని ఓ మంచి నీటి సరస్సు. ఆ ప్రాంతం ప్రకృతి రమణీయతకు పెట్టింది పేరు. ఆ నీటిలో సహజంగా దొరికే తామర ఆకుల నుంచి ఈ టీపొడిని తయారు చేస్తారు. మణిపుర్‌లోని థంగా గ్రామంలోని కొందరు మహిళల ఆలోచన నుంచే ఈ టీ పుట్టింది. ఈ సరస్సు దెబ్బతినకుండా ఎంతో జాగ్రత్తగా ఈ ఆకులను సేకరిస్తారు. ఆ స్వచ్ఛమైన నీరు, సారవంతమైన నేలలు, జీవవైవిధ్యం వల్ల ఆ టీకి ప్రత్యేకమైన రుచి, సువాసన చేకూరి ప్రత్యేకంగా నిలిపాయి. ఇలాంటి గిఫ్ట్‌ను మోదీ ఎంచుకోవడం వెనక ప్రత్యేక కారణమే ఉంది. ఈశాన్య రాష్ట్రాల్లో తయారవుతున్న ఇలాంటి ఉత్పత్తులకు అంతర్జాతీయ స్థాయిలో ప్రాచుర్యం కల్పించడమే అసలు ఉద్దేశం.

టీ.. స్పెషాలిటీ ఏంటో తెలుసా..?

ఇక, ఈ టీతో పాటు స్వీడన్ ప్రధానికి చేతితో తయారు చేసిన శాంతినికేతన్ లెదర్ బ్యాగ్, విశ్వకవి రవీంద్రనాథ్ ఠాగూర్ రచనలను బహూకరించారు. ఇవిగాక.. ఇటలీ ప్రధాని జార్జియా మెలోనీకి మణిపుర్ (ఘీఅఅజాబతీ)లో తయారయ్యే షిరుయ్ లిలీ పట్టు దుపట్టాను అందించారు. ఇటలీ అధ్యక్షుడు సెర్గియె మాటరెల్లీకి పండిట్ భీమ్‌సేన్ జోషి, కర్ణాటక సంగీత విద్వాంసురాలు ఎంఎస్ సుబ్బులక్ష్మి ఆలపించిన పాటల సీడీలను మార్బుల్‌తో తయారు చేయించిన ప్రత్యేక డబ్బాలో ఉంచి కానుకగా ఇచ్చిన సంగతి తెలిసిందే. మోదీ ఇచ్చిన కానుకల్లో మణిపుర్‌లో పండించే బ్లాక్‌రైస్‌కూడా ఉంది.

## 50 అత్యంత వేడి నగరాలు భారత్‌లోనివే

మొదటిపేజీ తరువాయి

దిల్లీ: దేశంలో భానుడి ఉగ్రరూపానికి ప్రజలు అల్లాడుతున్నారు. శుక్రవారం ఉదయం దాదాపు 11 గంటల సమయానికి నమోదైన ఉష్ణోగ్రతలను బట్టి చూస్తే.. ప్రపంచంలోనే 50 అత్యంత వేడి నగరాలన్నీ భారత్‌లోనే ఉన్నాయి. ఈ గణాంకాలను ఎయిర్‌క్వాలిటీ ఇండెక్స్ (ఏక్యూఐ) వెల్లడించింది. జాబితాలోని సగం నగరాలు ఉత్తర్‌ప్రదేశ్‌లోనివే కావడం గమనార్హం. మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్, బిహార్, తెలంగాణ, హరియాణా, మధ్యప్రదేశ్ తదితర రాష్ట్రాల్లోని పలు ప్రాంతాలూ ఇందులో ఉన్నాయి.

రానున్న వారం రోజులూ తీవ్రమైన వడగాలులు: రానున్న వారం పాటు తెలుగు రాష్ట్రాలు సహా వాయవ్య, మధ్య, తూర్పు భారత్‌లోని కొన్ని మైదాన ప్రాంతాల్లో తీవ్రమైన వడగాలులు వీచే అవకాశముందని భారత వాతావరణ విభాగం (ఐఎండీ) శుక్రవారం తెలిపింది. ఉత్తర్‌ప్రదేశ్, మధ్యప్రదేశ్, పంజాబ్, హరియాణా, చండీగఢ్, దిల్లీ, రాజస్థాన్‌లలోని పలు ప్రాంతాల్లో వడగాలులు వీస్తాయని అంచనా వేసింది. విదర్భ, ఆంధ్రాలోని తీరప్రాంతం, యానాం, ఛత్తీస్‌గఢ్, ఝార్ఖండ్, ఒడిశా, తెలంగాణ, జమ్మూకశ్మీర్, హిమాచల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్‌లలోనూ వడగాలులు వీచే అవకాశముందని తెలిపింది.

## వర్షాకాలంలో బొగ్గు ఉత్పత్తికి విఘాతం కలగకుండా చూడాలి:

మొదటిపేజీ తరువాయి

హైదరాబాద్: వర్షాకాలంలో బొగ్గు ఉత్పత్తికి విఘాతం కలగకుండా చూడాలని.. ఈ మేరకు ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని అన్ని ఏరియాల జనరల్ మేనేజర్లకు సింగరేణి సీఎండీ జ్యోతి బుద్ధప్రకాశ్ సూచించారు. కంపెనీ పంపులతో పాటు కొన్ని ప్రైవేటు పంపులను కూడా ఏర్పాటు చేసి.. నీరు నిల్వ ఉండకుండా చూడాలని ఆదేశించారు. వర్షాకాలంలోనూ థర్మల్ విద్యుత్ కేంద్రాలకు తగినంత బొగ్గును సరఫరా చేయాలన్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశం మేరకు ఆయన శనివారం జీఎంలతో సమీక్ష నిర్వహించారు. ఈ ఆర్థిక సంవత్సరంలో ఇప్పటివరకు ప్రతి ఏరియా సాధించిన బొగ్గు ఉత్పత్తి, బొగ్గు రవాణా, ఓవర్ బర్డెన్ తొలగింపుపైనా సమీక్షించారు. “హాల్ రోడ్లను పటిష్ఠపరచుకోవాలి. స్థానికంగా వాతావరణ విభాగం జారీ చేసే సూచనలను ఎప్పటికప్పుడు గమనిస్తూ ఉండాలి. భారీ యంత్రాలతో పూర్తి పని గంటలను సద్వినియోగం చేసుకోవాలి. మానవ వనరులను కూడా పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలి.

# బీసీ మహిళా నాయకురాలిపై వ్యాఖ్యలు మానుకోవాలి కాంగ్రెస్ నేతలకు ఓరుగంటి చంద్రశేఖర్ హెచ్చరిక

మేకార్తి దినపత్రిక కరీంనగర్ టౌన్ రిపోర్టర్,మంద జయ ప్రకాష్ రెడ్డి మే 24.

జగిత్యాలలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాంగ్రెస్ నాయకుల తీరుపై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. కేంద్రీయ విద్యాలయం అంశంపై మాట్లాడుతున్న ఒక బీసీ మహిళా నాయకురాలిపై కాంగ్రెస్ నాయకులు అనుచిత వ్యాఖ్యలు చేయడం దురదృష్టకరమని అన్నారు. ఇటీవల కలెక్టరేట్‌లో ప్రజాపాలన వారోత్సవాల సందర్భంగా నిర్వహించిన “ఎడ్యుకేషనల్ ఎక్సలెన్స్ విజయోత్సవం” కార్యక్రమం ప్రభుత్వ కార్యక్రమంలా కాకుండా కాంగ్రెస్ పార్టీ కార్యక్రమంలా నిర్వహించబడిందని ఆరోపించారు. అధికారిక కార్యక్రమంలో ఎటువంటి పదవులు లేని కాంగ్రెస్ నాయకులు నందయ్య, గిరినాగభూషణం, బండ శంకర్‌లను అధికారులతో పాటు వేదికపై కూర్చోబెట్టడంపై మంత్రి అడ్లూరి లక్ష్మణ్ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. నందయ్యకు స్కూల్‌లో ఎంతమంది విద్యార్థులు చదువుతున్నారో కూడా తెలియకుండా ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నారని చంద్రశేఖర్ విమర్శించారు. గూగుల్‌లో చూసినా కేంద్రీయ విద్యాలయంలో 1000 నుంచి 1200 మంది వరకు విద్యార్థులు చదువుతున్నారని తెలుస్తుందని అన్నారు. చదువు గురించి కాంగ్రెస్ నాయకులు మాట్లాడటం “దయ్యాలు వేదాలు వల్లించినట్లు ఉంది” అంటూ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. అయితే తమ నాయకురాలు భోగ శ్రావణి ఇక్కడి మీ ఎమ్మెల్యే సంజయ్ కుటుంబ సభ్యులు లాగా హైదరాబాద్ నుండి జగిత్యాల వచ్చి ఇక్కడ కాంట్రాక్టులు తీసుకొని చేయడం లేదని గుర్తు చేశారు. అసలు ఎమ్మెల్యే సంజయ్ వారానికి ఎన్నిసార్లు తన వ్యక్తిగత అవసరాల నిమిత్తం హైదరాబాద్ వెళ్తున్నారో అసలు వారి కార్యకర్తలకు తెలుస్తుందా లేదా అని ప్రశ్నించారు. శ్రావణి భర్త డాక్టర్ ప్రవీణ్ హైదరాబాదులో వృత్తిరీత్యా వైద్యులుగా పనిచేస్తున్నారని, అందుకోసం హైదరాబాద్ వెళితే ఇలాంటి దుష్ప్రచారాలు చేయడం సరికాదన్నారు. ఎమ్మెల్యే లాగా ప్రతి విషయంలో స్వార్థంగా ఆలోచించడం తమ నాయకురాలు శ్రావణికి తెలియదన్నారు. ఈ విషయం ఎమ్మెల్యే, ఎమ్మెల్యే అనుచరులు గుర్తుంచుకోవాలని హితవు పలికారు. అనంతరం బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు మ్యాదరి అశోక్ కాంగ్రెస్ నాయకుల తీరుపై తీవ్ర విమర్శలు చేశారు. డీసీసీ అధ్యక్షుడు నందయ్య తొలిసారిగా స్వతంత్రంగా ప్రెస్‌మీట్ నిర్వహించడం సంతోషకరమేనని, కానీ ఒక బీసీ మహిళా నాయకురాలు ఎదగడాన్ని జీర్ణించుకోలేక ఎమ్మెల్యే ప్రేరేపణతో మాట్లాడటం బాధాకరమని అన్నారు. గతంలో కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడిగా అడ్లూరి లక్ష్మణ్ అనేక ప్రెస్‌మీట్లు నిర్వహించారని, అయితే నందయ్య పరిస్థితి చూస్తే ఆయన పూర్తిగా ఎమ్మెల్యే ఆధీనంలో పనిచేస్తున్నట్టు కనిపిస్తోందని వ్యాఖ్యానించారు. “ఒక బీసీ ఆడబిడ్డ ఎదుగుదలను అడ్డుకోవడానికే నిన్ను ముందుకు నెట్టారు” అంటూ విమర్శించారు. భోగ శ్రావణి కుటుంబంపై వ్యక్తిగత విమర్శలు చేయడం తగదని, ఆమె కుటుంబ సభ్యులు ఎక్కడ ఉంటారో తెలుసుకోవాలంటే వారి ఇంటికి వెళ్లి మాట్లాడాలని సూచించారు. ఎమ్మెల్యే కుటుంబ సభ్యులు హైదరాబాద్‌లో ఉంటే తప్పుకాదని, అదే విధంగా శ్రావణి మేడం పిల్లలు హైదరాబాద్‌లో చదువుకుంటే ఎందుకు తప్పవుతుందని ప్రశ్నించారు. శ్రావణి భర్త వృత్తిరీత్యా వైద్యుడని, హైదరాబాద్‌లో ఆస్పత్రి నిర్వహిస్తూ సేవలు అందిస్తున్నారని తెలిపారు. అదే ఎమ్మెల్యే కూడా ఆయన వద్ద చికిత్స తీసుకున్నారని అన్నారు. “వాళ్లు హైదరాబాద్‌లో ఉద్యోగాలు, వృత్తులు చేసుకుంటే తప్పా?” అని ప్రశ్నించారు. కాంగ్రెస్ నాయకులు చేస్తున్న ఆరోపణలకు అర్థం లేదని, రాష్ట్ర స్థాయి నాయకురాలిగా శ్రావణి తరచూ హైదరాబాద్ వెళ్లి రావడం సహజమని చెప్పారు. “మా మేడం




లోకల్ లీడర్ కాదు, రాష్ట్ర నాయకురాలు. పార్టీ రాష్ట్ర కార్యాలయం హైదరాబాద్‌లో ఉంటుంది” అని స్పష్టం చేశారు. గాంధీ భవన్ మెట్లు ఎక్కని వారు ఇప్పుడు పెద్దగా మాట్లాడటం విడ్డూరంగా ఉందని ఎద్దేవా చేశారు. కార్యకర్తలను పార్టీ కార్యాలయానికి తీసుకెళ్లి పని చేసిన అనుభవం కాంగ్రెస్ నాయకులకు ఉందా అని ప్రశ్నించారు. నిన్నటి ప్రెస్‌మీట్‌లో చైర్మన్‌లు, మాజీ చైర్మన్‌లు, జిల్లా అధ్యక్షులను ఒకే వేదికపైకి తీసుకురావడం శ్రావణి అక్క నాయకత్వానికి నిదర్శనమని మ్యాదరి అశోక్ అన్నారు. “ఒక బీసీ ఆడబిడ్డను ఎదుర్కోవడానికి కాంగ్రెస్‌లోని మాజీలు, తాజాలు అందరూ ఒకే స్టేజిపైకి రావాల్సి వచ్చింది” అంటూ వ్యాఖ్యానించారు.

చివరగా, నందయ్య ఎప్పుడైనా శ్రావణి ఇంటికి వచ్చినా ఆతిథ్యంతో స్వాగతం పలికి చాయ్ ఇచ్చే సంస్కారం ఆమెకు ఉందని చెప్పారు. వ్యక్తిగత విమర్శలు మానుకొని ప్రజా సమస్యలపై దృష్టి పెట్టాలని కాంగ్రెస్ నాయకులకు సూచించార... ఈ సమావేశంలో జగిత్యాల పట్టణ అధ్యక్షులు కొక్కు గంగాధర్, ఎస్సీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఓరుగంటి చంద్రశేఖర్, జిల్లా ఉపాధ్యక్షులు మ్యాదరి అశోక్, జిల్లా కార్యదర్శి పాత రమేష్, ఆముద రాజు, దూరిశెట్టి మమత, మేడిపల్లి పుష్ప, ఇట్యాల రాము, పవన్ సింగ్, సింగం పద్మ, మామిడాల కవిత, సిరిపురం శ్రీనివాస్ మరియు తదితరులు పాల్గొన్నారు.

# మద్రిముత్యాలలో ప్రతిభావంతులైన విద్యార్థులకు సన్మానం.

మేకార్తి దినపత్రిక మే 24 సిద్దిపేట జిల్లా బ్యూరో కర్రోల్ల అన్నమ్మ.




మద్రిముత్యాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పది మరియు ఇంటర్ పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించి ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను చీ=వీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించి, బహుమతులు ప్రదానం చేశారు. అలాగే మద్రిముత్యాల ఎస్సీ కాలనీ పాఠశాల విద్యార్థులకు పరిశుభ్రమైన త్రాగునీరు అందించేందుకు చుంచు ప్రదీప్ కుమార్ తన సొంత ఖర్చులతో వాటర్ ప్యూరిఫైయర్‌ను బహుకరించారు. ఈ సందర్భంగా చీ=వీ ఫౌండేషన్ అధ్యక్షులు నక్కల నరేష్ రెడ్డి మాట్లాడుతూ.. పాఠశాల, గ్రామాభివృద్ధి కార్యక్రమాల్లో ఫౌండేషన్ సభ్యులు ఎల్లప్పుడూ ముందుంటారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, ఎన్‌ఆర్‌ఎమ్ సభ్యులు పాల్గొన్నారు.

# వడదెబ్బతో చెన్నూర్ వాసి జోగు మహేష్ మృతి.

- హైదరాబాద్‌లో కూలి పని చేస్తూ ఆకస్మిక మరణం.
- ప్రభుత్వం ఆదుకోవాలని కుటుంబ సభ్యులు,గ్రామస్థుల వేడుకోలు.

మేకార్తి దినపత్రిక మే 24 సిద్దిపేట జిల్లా బ్యూరో కర్రోల్ల అన్నమ్మ.



జనగాం జిల్లాపాలకుర్తి మండలంలో విషాదం చోటుచేసుకుంది. చెన్నూర్ గ్రామానికి చెందిన,జోగు మహేష్ (40,తండ్రి మల్లయ్య) వడదెబ్బతో ఆకస్మికంగా మృతి చెందాడు. ?స్థానికులు,కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం... మహేష్ బతుకుదెరువు నిమిత్తం హైదరాబాద్‌లోని చిలకలగూడలో నివాసం ఉంటూ కూలి పనులు చేసుకుంటున్నాడు. ఈ క్రమంలో శనివారం ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్న సమయంలో పని చేస్తుండగా, ఒక్కసారిగా వడదెబ్బకు గురై కుప్పకూలిపోయాడు. తీవ్రత ఎక్కువగా ఉండటంతో అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. కుటుంబాన్ని పోషించే యజమాని అకాల మరణం చెందడంతో భార్యాపిల్లలు రోదనలు మిన్నంటాయి. మృతుడి కుటుంబం అత్యంత పేదరికంలో ఉన్నందున, రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే స్పందించి ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని,బాధిత కుటుంబాన్ని అన్ని విధాలా ఆదుకోవాలని గ్రామస్థులు, కుటుంబ సభ్యులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నారు.

# గంభీరావుపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు జాతీయ స్థాయి గుర్తింపు






మేకార్తి దినపత్రిక మే 24 గంభీరావుపేట మండల రిపోర్టర్

రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండల కేంద్రంలోని ప్రభుత్వ మరియు పీజీ కళాశాల పర్యావరణ పరిరక్షణ హరిత కార్యక్రమములో ఉత్తమ ప్రతిభ కనబరిచినందుకు కళాశాలకు “ప్లాటినం సస్టైనబుల్ క్యాంపస్ పార్ట్నర్ “ జాతీయస్థాయి గుర్తింపు లభించినట్లు కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్. శ్రీమతి. వి. విజయలక్ష్మి తెలిపారు. ఈరోజు ప్రిన్సిపాల్ గారు మాట్లాడుతూ రీసెర్చ్ హైట్స్ ఫౌండేషన్, ఎన్విరాన్ మెంటల్ ప్రొటెక్షన్ ట్రైనింగ్ అండ్ రీసెర్చ్ ఇన్స్టిట్యూట్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన భారత్ ఎన్విరాన్ మెంట్ ప్రోగ్రాం – జాతీయ సుస్థిర క్యాంపస్ మిషన్ 2026లో భాగంగా ఈ అవార్డును ప్రకటించారని ప్రిన్సిపాల్ గారు తెలిపారు. గత నెల 22 నుండి 29 వరకు నిర్వహించిన ధైత్రి వారోత్సవాలనుపురస్కరించుకొని కళాశాలలో చేపట్టిన పర్యావరణ కార్యక్రమాలకు గాను ఈ గుర్తింపుదక్కిందన్నారు.

ఐక్యరాజ్యసమితిసుస్థిరాభివృద్ధి లక్ష్యాల సాధనకు అనుగుణంగా కళాశాల క్యాంపస్ లో మొక్కలు నాటడం, నీటి పొదుపు, పరిశుభ్రత నిర్వహణ, విద్యార్థులతో పర్యావరణ పరిరక్షణ పై విజయవంతంగా నిర్వహించినందుకు గాను ఈ అవార్డు లభించిందన్నారు. జూన్ 1న గచ్చిబౌలిలోని శాంతి సరోవర్ గ్లోబల్ పీస్ఆడిటోరియంలో జరగబోయే సస్టైనబుల్ క్యాంపస్ ఇంప్లాక్ట్ సమ్మిట్ అండ్ అవార్డ్స్ 2026 సదస్సుకు హాజరు కావాలంటూ ఇప్పటికే ఆహ్వానం అందిందన్నారు. జాతీయస్థాయి గుర్తింపు లభించడంలో కీలక పాత్ర పోషించిన వృక్ష శాస్త్ర అధ్యాపకులు సూచరణ్ ను ప్రిన్సిపాల్ గారుఅభినందించారు. అదేవిధంగా ఈ గుర్తింపు రావడానికి సహాయ సహకారాలు అందించిన కళాశాల వైస్ ప్రిన్సిపాల్. డాక్టర్. ఎం. ప్రభాకర్, ఐక్యూఎస్సీ కోఆర్డినేటర్ డాక్టర్. వై. ఆంజనేయులు, టి ఏ ఎస్ కే కోఆర్డినేటర్ డాక్టర్. జె. శ్రావణ్ కుమార్, ఎన్ ఎస్ ఎస్. పి. ఓ.పాక ధర్మపురి, స్కాలర్షిప్ కోఆర్డినేటర్ డాక్టర్. ఎన్. ఆదివిష్ణు, డబ్ల్యూ ఏసి కోఆర్డినేటర్ వి. వాణి,డాక్టర్. కేవీ బిక్షమయ్య, మనోహర్,శ్రీనివాస్, కృష్ణ ప్రసాద్, మహేష్, దీపికా, భార్గవి, శంకర్, సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాస్, అధ్యాపక, అధ్యాపకేతర బృందం ఈ అవార్డును అందరూ కలిసి సాధించిన విజయమని ప్రిన్సిపాల్ గారు తెలియజేశారు.

# డివివోగా పదోన్నతి పొందిన శ్రీనివాస్ గౌడ్‌కు ఘన సన్మానం...

- సిద్దిపేట జిల్లా విజిలెన్స్ అధికారిగా బాధ్యతలు...

మేకార్తి దినపత్రిక, మే 24 ఇల్లంతకుంట



ఇల్లంతకుంట మండలంలో గతంలో ఎంపిడిఓగా విధులు నిర్వర్తించి, ప్రజల మన్ననలు పొందిన గున్నాల శ్రీనివాస్ గౌడ్ డివివోగా పదోన్నతి పొందారు. ఆయన సిద్దిపేట జిల్లా విజిలెన్స్ అధికారిగా బాధ్యతలు చేపట్టిన సందర్భంగా ఆదివారం వల్లంపట్ల గౌడ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వారు ఆయనకు శాలువాలు కప్పి, పుష్పగుచ్ఛాలు అందజేసి శు భాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, శ్రీనివాస్ గౌడ్ తన విధి నిర్వహణలో నిబద్ధతతో పనిచేశారని, భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో దుబ్బాక సిడిపివో నాయిని ఎల్లయ్య, మండల గౌడ సంఘం అధ్యక్షుడు గజ్జెల రాజశేఖర్ గౌడ్, సర్పంచ్ నేరెళ్ల విజయ్ గౌడ్, మాజీ సర్పంచ్ మేకల శ్రీనివాస్ యాదవ్, కట్ట నర్సింహా రెడ్డి, నాయిని ధర్మయ్య, నాయిని రమేష్, నేరెళ్ల శ్రీనివాస్, నాయిని మల్లేశం, పులి మల్లేశం, కీసరి రవి, నేరెళ్ల రాజు, కాసారపు పర్శరాములు, నాయిని మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

# ఢిల్లీకి ప్రయాణమైన మందకృష్ణ మాదిగ.



మేకార్తి దినపత్రిక మే 24 సిద్దిపేట జిల్లా బ్యూరో కర్రోల్ల అన్నమ్మ.

దళిత క్రైస్తవుల సామాజిక, ఆర్థిక పరిస్థితులపై ఏర్పాటు చేయబడిన జస్టిస్ కేజీ బాలకృష్ణ కమిషన్ ని కలవడానికి ఢిల్లీకి ప్రయాణమైన ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు పద్మశ్రీ మంద కృష్ణ మాదిగ దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా రిజర్వేషన్లు కల్పించాలని కోరుతూ మరియు క్రైస్తవ మతంలో దళితులు ఎదుర్కొంటున్న అనేక సమస్యలు కూడా పరిష్కరించాలని పద్మశ్రీ మంద కృష్ణ మాదిగ జస్టిస్ కేజీ బాలకృష్ణన్ కమిషన్ ని కలిసి వినతి పత్రం ఇవ్వడం జరుగుతుంది. అలాగే భారతదేశానికి స్వతంత్రం అనంతరం కుల వ్యవస్థ పై మరియు దళిత క్రైస్తవులపై ఏర్పాటు చేయబడినటువంటి అనేక కమిటీ రిపోర్టను, కమిషన్ రిపోర్ట్ లను కమిషన్ కి సమర్పించనున్నారు.

# ఉపాధి హామీ పథకంలో కొత్త చట్టం! జూలై 1 నుంచి అమలు!

మేకార్తి దినపత్రిక,మే 24 హైదరాబాద్



కేంద్ర ప్రభుత్వం దేశ గ్రామీణ ప్రాంతాల ముఖచిత్రాన్ని మార్చే దిశగా చారిత్రాత్మక నిర్ణయం తీసుకుంది దశాబ్దాలుగా అమల్లో ఉన్న జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం స్థానంలో, కొత్త చట్టాన్ని తీసుకువచ్చిం ది, కొత్తగా తీసుకువ చ్చిన వికసిత్ భారత్-గ్యారంటీ ఫర్ రోజ్‌గార్ అండ్ అజీ వికమిషన్ గ్రామీణ, వీబీ-జీరామ్ జీచట్టం- 2025 ముసాయిదా నిబంధనలను కేంద్ర ప్రభుత్వం శనివారం విడుదల చేసింది. ఈ చట్టం అమలు ఎలా, పనుల పర్య వేక్షణ బాధ్యత ఎవరిది, పథకానికి ఎవరు అర్హులు, పని దినాలెన్ని, వేతనాల చెల్లింపులు ఎలా, రాష్ట్ర ప్రభుత్వాల విధులేంటి.. అన్న అంశాలను అందులో పేర్కొంది.లబ్ధిదారులు ఉపాధి హామీ చట్టం నుంచి వీబీ-జీరామ్‌జీ చట్టానికి మారే ప్రక్రి యను వివరించింది.ఈ చట్టం దేశవ్యాప్తం గా జూలై 1 నుంచి అమల్లోకి రానుంది. ఈ నేపథ్యంలో ముసా యిదా నిబంధనలపై అభ్యంతరాలుంటే జూన్ 21లోగా తెలియజేయాలని రాష్ట్రాలను, నిపుణుల ను, సంస్థలను, ప్రజా సంఘాలను కోరింది. ముసాయిదాలో పేర్కొన్న దాని ప్రకా రం.. వీబీ-జీరామ్‌జీ చట్టం అమలుకు కేంద్ర స్థాయిలో స్టీరింగ్ కమిటీని ఏర్పాటు చేస్తారు. ఇందులో కేంద్రగ్రామీ ణాభివృద్ధి శాఖ, నీతి ఆయోగ్ నుంచి ప్రతి నిధులు, కేంద్రమంత్రు లు, రాష్ట్రాల ప్రతినిధు లు సభ్యులుగా ఉంటా రు. ఇక, కేంద్రస్థాయి లోనే సెంట్రల్ గ్రామీణ్ రోజ్‌గార్ గ్యారంటీ కౌన్సిల్ పనులను పర్యవేక్షిస్తుంది. చట్టం అమలును చేస్తుంది,ఈ చట్టంలో ఒక కూలీకి ఏడాదిలో కల్పించాల్సిన పనిదినాల సంఖ్యను 100 నుంచి 125కి పెంచారు. కూలీలు కోరిన 15రోజుల్లోగా పని ఇవ్వాల్సి ఉంటుంది. లేకపోతే, వారికి భృతిని చెల్లిం చాలి. పని కల్పించడం ఆలస్యమైన మొదటి 30రోజుల్లో.. రోజువారీ గా కనీసం పావు వంతు వేతనం చెల్లించాలి. తర్వాత కూడా పని కల్పించక పోతే సగం వేతనాన్ని చెల్లించాలని ముసా యిదా నిబంధనల్లో పేర్కొన్నారు. ప్రస్తుతం ఈ కేవైసీ చేసుకున్న వారందరినీ కొత్త చట్టం కింద గుర్తిస్తారు.

# జనగాం మున్సిపాలిటీ చరిత్ర ఒక విశిష్ట ప్రయాణం

**- జనగాం మున్సిపాలిటీ ఆవిర్భావం.**

మేకార్తి దినపత్రిక మే 24 సిద్దిపేట జిల్లా బ్యూరో కర్రోల్ల అన్నమ్మ.

జనగాం పట్టణ చరిత్ర ఎంతో పురాతనమైనది. అధికారికంగా 1953 సంవత్సరంలో జనగాం మున్సిపాలిటీ ఏర్పాటైంది. ప్రారంభంలో ఇది తృతీయ శ్రేణి (××× +తీ్ఖుఎవ) మున్సిపాలిటీగా స్థాపించబడగా, పట్టణ విస్తరణ, జనాభా పెరుగుదల మరియు అభివృద్ధి కార్యక్రమాల ఫలితంగా 2010లో ద్వితీయ శ్రేణి (×× +తీ్ఖుఎవ) మున్సిపాలిటీగా అప్‌గ్రేడ్ చేయబడింది.

**ముఖ్య వివరాలు.**

స్థాపన సంవత్సరం : 1953 మొదటి స్థాయి : ××× +తీ్ఖుఎవ వీబఅఱఎఱజ్ఖుశ్రీ్‌ఱఎ అప్‌గ్రేడ్ : 2010లో ×× +తీ్ఖుఎవ వీబఅఱఎఱజ్ఖుశ్రీ్‌ఱఎ ప్రస్తుత రాష్ట్రం : తెలంగాణ జిల్లా కేంద్రం : జనగాం జిల్లా మున్సిపల్ వార్డులు : ప్రస్తుతం 30 మున్సిపాలిటీ ఏర్పాటుకు ముందు నిజాం పాలన కాలంలో, సుమారు 1935 ప్రాంతంలో జనగాంలో మొదటి స్థానిక పరిపాలనా వ్యవస్థ ఏర్పడింది. ఆ సమయంలో ఒక లితహసీల్దార్‌ను స్థానిక పరిపాలన అధికారి (జష్ట్రుఱతీఖ్యఱ)లిగా గూడూరు జగన్నాథరెడ్డిని నియమించారు.

ఆయనతో పాటు పట్టణంలోని ప్రముఖులను కమిటీ సభ్యులుగా చేర్చి పరిపాలన నిర్వహించారు.ఈ వ్యవస్థ సుమారు 17 సంవత్సరాలు కొనసాగింది. అనంతరం 1952లో మొదటి స్థానిక ఎన్నికలు జరిగాయి.

ఆ తరువాత 1953లో జనగాం అధికారిక మున్సిపాలిటీగా అవతరించింది.

**జనగాం చరిత్ర ఒక చూపు**

ప్రాచీన చరిత్ర."జైన్ గావ్" అనే పదం నుంచే "జనగాం" అనే పేరు ఉద్భవించినట్లు చారిత్రక ఆధారాలు సూచిస్తున్నాయి. ఈ ప్రాంతంలో జైన మతానికి చెందిన విగ్రహాలు తవ్వకాలలో బయటపడటం విశేషం.11వ శతాబ్దంలో కళ్యాణి చాళుక్యుల రెండో రాజధానిగా ఈ ప్రాంతం ఉన్నట్లు చారిత్రక ఆధారాలు చెబుతున్నాయి.

**కాకతీయుల కాలం.**

1195--1323 మధ్య కాకతీయుల పాలనలో జనగాం ప్రాంతం విశేష అభివృద్ధిని సాధించింది. తెలుగు సాహిత్య మహాకవి బమ్మెర పోతన జనగాం సమీపంలోని బమ్మెర గ్రామంలో జన్మించారు.

**ఆధునిక పరిపాలన**

1866లో జనగాం ప్రాంతం వరంగల్ జిల్లాలో విలీనం చేయబడింది. 2016 అక్టోబర్ 11న తెలంగాణ రాష్ట్రంలో కొత్త జిల్లాల ఏర్పాటు సందర్భంగా జనగాం ప్రత్యేక జిల్లాగా అవతరించింది. జనగాం మున్సిపాలిటీ -- ముఖ్య సమాచారం అంశం వివరాలు స్థాపన 1953 అప్‌గ్రేడ్ 2010 మున్సిపాలిటీ రకం ×× +తీ్ఖుఎవ విస్తీర్ణం 17.49 చ.కి.మీ జనాభా (2011) 52,408 వార్డులు 30 జిల్లా జనగాం

**అభివృద్ధి పథంలో జనగాం**



నేడు జనగాం మున్సిపాలిటీ తెలంగాణ రాష్ట్రంలోని వేగంగా అభివృద్ధి చెందుతున్న పట్టణ స్థానిక సంస్థలలో ఒకటిగా నిలిచింది.

**ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు:**

తాగునీటి సరఫరా ఆధునిక రహదారుల నిర్మాణం డ్రైనేజ్ వ్యవస్థ అభివృద్ధి ఆన్‌లైన్ పన్ను చెల్లింపు సేవలు పట్టణ సౌందర్యీకరణ కార్యక్రమాలు విజయవంతంగా అమలు చేస్తోంది.

**ముగింపు.**

70 సంవత్సరాలకు పైగా చరిత్ర కలిగిన జనగాం మున్సిపాలిటీ, నిజాం కాలం స్థానిక పరిపాలన నుంచి ఆధునిక పట్టణ పాలన వరకు విశేషమైన ప్రయాణాన్ని కొనసాగిస్తోంది. చారిత్రక వారసత్వాన్ని కాపాడుకుంటూనే ఆధునిక అభివృద్ధి వైపు అడుగులు వేస్తూ తెలంగాణలో ఆదర్శ మున్సిపాలిటీలలో ఒకటిగా ఎదుగుతోంది.ప్రత్యేక కథనం జనగాం చరిత్ర. ప్రజా పాలన. అభివృద్ధి.

రాజకుమార్. ఆర్

# లోడింగ్, అన్ లోడింగ్ వేగంగా పూర్తి చేయాలి

**- ధాన్యానికి అనుగుణంగా వాహనాలను సమకూర్చాలి**
**- జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్**
**- ధాన్యం కొనుగోళ్లు, తరలింపు, జన గణన ప్రక్రియపై టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించిన కలెక్టర్**

మేకార్తి దినపత్రిక,మే-24 రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి



జిల్లాలోని కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం సేకరణ, వాహనాల్లో లోడింగ్, రైస్ మిల్లులు, గోదాముల్లో అన్ లోడింగ్ వేగంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు.ధాన్యం కొనుగోళ్లు, తూకం వేసిన బస్తాల తరలింపు, వాహనాలు, హమాలీల సంఖ్య పెంచడం, మిల్లుల్లో ధాన్యం అన్ లోడింగ్, ఆన్ లైన్ ట్యాబ్ ఎంట్రీ వేగవంతం చేయడంపై అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, పౌర సరఫరాలు, సహకార శాఖ, గ్రామీణా భివృద్ధి శాఖ, మెప్మా, రవాణా శాఖ .. అలాగే జన గణనపై సీపీఓ శ్రీనివాసాచారి, ఛార్జ్ అధికారులు తహసీల్దార్లు, మున్సిపల్ కమిషనర్లతో జిల్లా కలెక్టర్ టెలీ కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. మండలాల వారీగా మొత్తం వచ్చిన ధాన్యం ఎంత? ఇప్పటి దాకా కొనుగోలు చేసింది ఎంత? అని అడిగి తెలుసుకున్నారు. తహసీల్దార్లు అందుబాటులో ఉండి కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం నిలువలు తనిఖీ చేయాలని సూచించారు. తుది దశలో ఉన్న కొనుగోలు కేంద్రాల్లో కొనుగోళ్లు వేగంగా పూర్తి చేయాలని, అక్కడి వాహనాలు, హమాలీలను మరో కొనుగోలు కేంద్రాలకు తరలించాలని సూచించారు. అన్ని రైస్ మిల్లుల్లో అన్ లోడింగ్ పరిశీలిస్తూ.. పూర్తి అయిన వాహనాలను కొనుగోలు కేంద్రాలకు పంపించాలని అధికారులకు సూచించారు.కొనుగోలు కేంద్రాల్లో సిద్ధంగా ఉన్న ధాన్యం బస్తాల తరలింపునకు ట్రాన్స్ పోర్ట్ కాంట్రాక్టర్లు వాహనాలు సమకూర్చేలా చూడాలని జిల్లా రవాణా శాఖ అధికారిని ఆదేశించారు. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం లోడింగ్, అపరెల్ పార్క్, గోదాములు, రైస్ మిల్లుల్లో అన్ లోడింగ్ పై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని, హమాలీల సంఖ్య పెంచాలని సూచించారు.

**జన గణన పకడ్బందీగా చేయాలి**

జిల్లాలో జన గణన పకడ్బందీగా వేగంగా చేయాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. మండలాల వారీగా పురోగతి పై ఆరా తీశారు. ఛార్జ్ అధికారులు తమ పరిధిలోని సూపర్ వైజర్లు, ఎన్యూమ రేటర్లతో సమావేశం నిర్వహించాలని సూచించారు. ప్రభుత్వ లక్ష్యం మేరకు విధులు నిర్వర్తించాలని స్పష్టం చేశారు. క్షేత్ర స్థాయిలోకి వెళ్లి పరిశీలించి.. వివరాలను గడువులోగా నమోదు చేయాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ సూచించారు.

# గన్నేరువరంలో ఉచిత మెగా వైద్య శిబిరం.

**- గ్రామీణ ప్రజలకు నాణ్యమైన వైద్యం చేరువ చేయడమే లక్ష్యం**
**- కరీంనగర్ మెడికవర్ హాస్పిటల్ ఆధ్వర్యంలో**


మేకార్తి దినపత్రిక (మే 24) గన్నేరువరం మండల ప్రతినిధి

గన్నేరువరం గ్రామీణ ప్రాంత ప్రజలకు కార్పొరేట్ స్థాయి సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలను అందుబాటులోకి తీసుకురావడం, ప్రారంభ దశలోనే ఆరోగ్య సమస్యలను గుర్తించి సరైన చికిత్స అందించడం లక్ష్యంగా కరీంనగర్ మెడికవర్ ఆసుపత్రి ఆధ్వర్యంలో ఆదివారం కరీంనగర్ జిల్లా గన్నేరువరం మండల కేంద్రంలో ఉచిత మెగా వైద్య శిబిరం ఘనంగా నిర్వహించారు. గ్రామీణ ప్రజలు సాధారణ అనారోగ్య సమస్యల నుంచి గుండె, మధుమేహం, రక్తపోటు, మహిళల ఆరోగ్య సమస్యల వరకు పలు వ్యాధులతో బాధపడుతున్నప్పటికీ, సరైన వైద్య పరీక్షలు చేయించుకోలేక అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో ఈ శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు.శిబిరానికి గ్రామ ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. సుమారు 200 మందికి పైగా రోగులు శిబిరానికి హాజరై ఆరోగ్య పరీక్షలు చేయించుకున్నారు. నిపుణులైన వైద్యులు ప్రతి ఒక్కరి ఆరోగ్య పరిస్థితిని సమగ్రంగా పరిశీలించి అవసరమైన వైద్య సూచనలు అందించారు. సాధారణ వైద్య సేవలకే పరిమితం కాకుండా, సూపర్ స్పెషాలిటీ స్థాయి వైద్య పరీక్షలు కూడా నిర్వహించడం ఈ శిబిరం ప్రత్యేకతగా నిలిచింది.శిబిరంలో పాల్గొన్న మెడికవర్



ఆసుపత్రి కార్డియాలజిస్టు డాక్టర్ వాసుదేవరెడ్డి గుండె సంబంధిత సమస్యలపై రోగులకు అవగాహన కల్పిస్తూ, ఛాతినొప్పి, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది, అధిక అలసట వంటి లక్షణాలను నిర్లక్ష్యం చేయొద్దని సూచించారు. ప్రారంభ దశలోనే గుండె సంబంధిత వ్యాధులను గుర్తిస్తే ప్రమాదాలను తగ్గించవచ్చని తెలిపారు. జనరల్ సర్జన్ డాక్టర్ తాహా శస్త్రచికిత్స అవసరమయ్యే ఆరోగ్య సమస్యలపై రోగులకు వివరించారు. జనరల్ ఫిజీషియన్ డాక్టర్ నాగరాజు సాధారణ వ్యాధులు, షుగర్, బీపీ వంటి సమస్యలపై ప్రజలకు సూచనలు అందించారు. గైనకాలజిస్టు డాక్టర్ నయన మహిళల ఆరోగ్య సమస్యలను పరిశీలించి తగిన సలహాలు ఇచ్చారు.ఈ వైద్య శిబిరంలో అవసరమైన వారికి ఉచితంగా షుగర్ పరీక్షలు, రక్తపోటు పరీక్షలు, ఈసీజీ, 2డి ఎకో వంటి కీలక వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ పరీక్షల ద్వారా పలువురిలో ఆరోగ్య సమస్యలను ప్రారంభ దశలోనే గుర్తించినట్లు వైద్యులు తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో చాలామంది ప్రజలు లక్షణాలు తీవ్రమయ్యే వరకు ఆసుపత్రులను సంప్రదించరని, దాంతో చిన్న సమస్యలు పెద్ద ఆరోగ్య సమస్యలుగా మారే ప్రమాదం ఉందని వైద్య నిపుణులు పేర్కొన్నారు. ఇలాంటి ఉచిత వైద్య శిబిరాల ద్వారా ప్రజల్లో ఆరోగ్యంపై చైతన్యం పెంపొందడంతో పాటు, వ్యాధులను ముందుగానే గుర్తించి చికిత్స అందించే అవకాశం కలుగుతుందని వివరించారు.రోగులకు అవసరమైన మందులను ఉచితంగా పంపిణీ చేయడంతో పాటు, తదుపరి చికిత్స అవసరమైన వారికి ప్రత్యేక సూచనలు అందించారు. ఆరోగ్య పరిస్థితి మరింత పరిశీలన అవసరమని గుర్తించిన రోగులను కరీంనగర్‌లోని మెడికవర్ ఆసుపత్రికి తరలించి ఆధునిక వైద్య సేవలు అందించేందుకు చర్యలు తీసుకుంటామని ఆసుపత్రి ప్రతినిధులు తెలిపారు.ఈ సందర్భంగా మెడికవర్ ఆసుపత్రి సెంటర్ హెడ్ గుర్రం కిరణ్ మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడం మా సామాజిక బాధ్యతగా భావిస్తున్నాం. నగరాలకు వెళ్లలేని ప్రజలకు వారి ప్రాంతానికే నిపుణుల వైద్య సేవలు అందించాలనే ఉద్దేశంతో ఇటువంటి ఉచిత వైద్య శిబిరాలను నిర్వహిస్తున్నాం. పండుగలు, సెలవులు అనే తేడా లేకుండా 24 గంటల పాటు అన్ని రకాల సూపర్ స్పెషాలిటీ సేవలను అందిస్తున్నాం. అవసరమైతే రోగులను కరీంనగర్‌లోని మెడికవర్ ఆసుపత్రికి తరలించి మెరుగైన చికిత్స అందిస్తాం అని తెలిపారు.గ్రామ సర్పంచ్ రంగనవేని లచ్చినర్సు మాట్లాడుతూ, గ్రామ ప్రజలకు ఉచితంగా నాణ్యమైన వైద్య సేవలు అందించిన మెడికవర్ ఆసుపత్రి యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలిపారు. ఆరోగ్యం పట్ల ప్రజలు నిర్లక్ష్యం చేయకుండా తరచూ వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ రామంచ స్వామి, కారోబార్ మాధవరావు, వార్డు సభ్యులు, మెడికవర్ మార్కెటింగ్ మేనేజర్ కోట కరుణాకర్,అబ్దుల్ వకీల్, గరిగె అనిల్‌కుమార్, మనోజ్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

# వరి ధాన్యం కొనుగోలు పై



మేకార్తి దినపత్రిక మే 24 హైదరాబాద్

హైదరాబాద్ లోని పౌర సరఫరాల సంస్థ కార్యాలయం నుంచి రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి గారి నేతృత్వంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ,రాష్ట్ర మంత్రులు,ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, ఉన్నతాధికారులతో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లతో నిర్వహించిన విడియో కాన్ఫరెన్స్లో రాష్ట్ర ప్రభుత్వ విప్ వేములవాడ శాసనసభ్యులు ఆది శ్రీనివాస్ పాల్గొనడం జరిగింది రాష్ట్రంలో వరి ధాన్యం సేకరణ, రాష్ట్రవ్యాప్తంగా కొనుగోలు కేంద్రాల పనితీరు, రైతులకు చెల్లింపులు, ధాన్యం రవాణా, గోదాముల నిల్వ సామర్థ్యంపై, ప్రజాపాలన--ప్రగతి ప్రణాళికలో భాగంగా వచ్చే వారం నిర్వహించే మహిళా సంక్షేమ కార్యక్రమాల కార్యాచరణ ప్రణాళిక తదితర అంశాలపై వీడియో కాన్ఫరెన్స్ లో చర్చించారు.

## జొన్నల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన ఏ యం సి చైర్మన్ కొప్పుల లక్ష్మి శేషారెడ్డి

మేకార్తి దినపత్రిక



ఆందోల్ నియోజకవర్గం వట్పల్లి మండలం మరవెల్లి గ్రామంలో నూతనంగా జొన్నల కొనుగోలు కేంద్రం మంజూరు అయినందున , నేడు ఫంక్షన్ హాల్ మర్వెళ్ళి లో శ్రీ మతి కొప్పుల లక్ష్మి శేషారెడ్డి మరియు ఆత్మ కమిటీ చైర్మన్ కచూర్ రావు కొబ్బరి కాయ కొట్టి ప్రారంభించారు. దళారులు ఇచ్చే తక్కువ ధరకు మోసపోకుండా ప్రభుత్వ మద్దతు ధర రూ. 3699/- కు అమ్మి లాభం పొందాలని సూచించారు. ఎకరానికి 10 క్విం. మాత్రమే అమ్మవచ్చును. బయోమెట్రిక్ ధ్రువీకరణ తప్పనిసరి అయినందున రైతు నేరుగా కేంద్రానికి రావలిసి ఉంటుందని చెప్పారు. రైతులు నిర్వాహకులకు సహకరించి కేంద్రానికి మంచి పేరు తేవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో శేషారెడ్డి, ఈశ్వరయ్య, ఉపాధ్యక్షులు, యూత్ అధ్యక్షులు వెంకట్ పాటిల్, శివచరణ్ మాజీ సర్పంచ్, డైరెక్టర్లు, సర్పంచులు, మాజీ ఎంపీ. టి. సి లు , ప్రశాంత్ పాటిల్, కాంగ్రెస్ నాయకులు, యూత్, రైతు సోదరులు, డి. సి యం ఎస్ నిర్వాహకులు వంశీ గారు, తదితరులు పాల్గొన్నారు.

## వంగూరు మండలం కిష్టం పల్లి వద్ద భారీ రోడ్డు ప్రమాదం

– ట్రాక్టర్ ఢీకొట్టడంతో అక్కడికక్కడే మరణించిన యువకుడు

మేకార్తి దినపత్రిక



నాగర్ కర్నూల్ జిల్లా అచ్చంపేట నియోజకవర్గం వంగూరు మండలం కిష్టంపల్లి గ్రామం వద్ద శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడు అక్కడికక్కడే మృతి చెందాడు. 108 సిబ్బంది తెలిపిన వివరాల ప్రకారం డిండి మండలం దుబ్బ తండా కు చెందిన మహేష్ (14) యువకుడు ద్విచక్ర వాహనం పై కిష్టంపల్లి వైపు వస్తుండగా వెనుక నుంచి వస్తున్న ట్రాక్టర్ ఒక్కసారిగా బైకును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో మహేష్ అక్కడికక్కడే మృతి చెందాడు. బంధువుల బోధనలతో ఘటనాస్థలం అంతా ఒక్కసారిగా విషాద ఛాయలు నెలకొన్నాయి. చేతికి వచ్చిన కొడుకు కనిపించని అనంత లోకాలకు వెళ్లిపోయాడని యువకుడు తల్లిదండ్రులు కన్నీరు మున్నీరవుతున్నారు. సమాచారం అందుకున్న వంగూరు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## అచ్చంపేట పట్టణంలో అకాల వర్షం. మార్కెట్ యాడ్ అంతా జలమయం

వరద నీటిలో ముద్దాయిన ధాన్యం.ఆవేదన వ్యక్తం చేస్తున్న రైతులు

మేకార్తి దినపత్రిక



నాగర్ కర్నూల్ జిల్లా అచ్చంపేట పట్టణంలో శనివారం కురిసిన అకాల వర్షం కారణంగా మార్కెట్ యార్డ్ అంత జలమయమైపోయింది. నెలలపాటు ఎండనక వాననక కష్టపడి పండించిన పంట అమ్మకం కోసం మార్కెట్ కి తీసుకువస్తే ధాన్యం వర్షం నీటితో తడిసి ముద్దవుతూ వరద ప్రవాహంలో కొట్టుకుపోతుండడాన్ని చూసి రైతులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ ధాన్యాన్ని చేతులతో కాపాడుకునేందుకు ఎన్ని ప్రయత్నాలు చేసినా సరైన షెడ్లు లేక, నీటిపారుదల సదుపాయం లేకపోవడంపై రైతులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఆకాల వర్షం కారణంగా నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని అదేవిధంగా తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

## మొక్కజొన్న నిల్వలు వెంటనే గోదాములకు తరలించాలి.

– ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో వైద్యులు అందుబాటులో ఉండాలి : జిల్లా కలెక్టర్ అంకిత్

మేకార్తి దినపత్రిక

ఆళ్లపల్లి : మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ అంకిత్ శనివారం ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా కొనుగోలు కేంద్రంలో జరుగుతున్న మొక్కజొన్న కొనుగోలు, నిల్వ, లోడింగ్ రవాణా ప్రక్రియలను పరిశీలించి సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. కొనుగోలు కేంద్రంలో ప్రస్తుతం 117 మెట్రిక్ టన్నుల మొక్కజొన్న నిల్వ ఉన్నదని అధికారులు కలెక్టర్‌కు వివరించారు. దీనిపై స్పందించిన కలెక్టర్ మొక్కజొన్న నిల్వలు ఎక్కువకాలం కొనుగోలు కేంద్రంలో ఉండకుండా వెంటనే గోదాములకు తరలించేలా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. రైతులు తీసుకొస్తున్న మొక్కజొన్నను సకాలంలో కొనుగోలు చేసి వేగవంతంగా లోడింగ్ పూర్తి చేయాలని సూచించారు.ముఖ్యంగా రవాణా వాహనాలు, హమాలీల లభ్యతపై ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ తెలిపారు. లారీల కొరత లేదా హమాలీల సమస్యల కారణంగా తరలింపు ప్రక్రియలో జాప్యం జరగకుండా ముందస్తు ప్రణాళికతో పనిచేయాలని అధికారులకు సూచించారు. రవాణా శాఖ అధికారులను అడిగి లారీల అందుబాటు, లోడింగ్ పనుల పురోగతి, రోజువారీ తరలింపు సామర్థ్యం తదితర అంశాలపై వివరాలు తెలుసుకున్నారు. అవసరమైతే అదనపు వాహనాలు సమకూర్చి మొక్కజొన్న నిల్వలను వేగవంతంగా తరలించాలని ఆదేశించారు.అకాల వర్షాలను దృష్టిలో ఉంచుకొని నిల్వ ఉన్న మొక్కజొన్న తడవకుండా తగిన రక్షణ చర్యలు చేపట్టాలని తెలిపారు. రైతులకు తాగునీరు, నీడ, కూర్చునే సదుపాయాలు కల్పించాలని, కొనుగోలు ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించి రైతులకు సంబంధించిన చెల్లింపులు త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులకు సూచించారు.అనంతరం ఆళ్లపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో సిబ్బంది హాజరు శాతం, వైద్య సేవల నిర్వహణ, రోగులకు అందుతున్న సౌకర్యాలను పరిశీలించారు.తనిఖీల సందర్భంగా మెడికల్ అధికారి తరుణ్ అందుబాటులో లేకపోవడంతో కలెక్టర్ అసహనం వ్యక్తం చేశారు. విధుల్లో ఎందుకు లేరని సిబ్బందిని ప్రశ్నించి వివరణ కోరారు. సంబంధిత శాఖ అధికారులను దీనిపై పూర్తి నివేదిక సమర్పించాలని ఆదేశించారు. అనంతరం సిబ్బంది హాజరు పట్టికలు, రిజిస్టర్‌లను పరిశీలించి ప్రతి ఉద్యోగి విధుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. గైర్హాజరైన సిబ్బంది సెలవుల వివరాలు, డిప్యూటేషన్‌పై విధులు నిర్వహిస్తున్న వారి సమాచారం తదితర అంశాలపై సమగ్ర వివరాలు తెలుసుకున్నారు.అవుట్ పేషెంట్ విభాగం, పరీక్షల గది, మందుల నిల్వ గది, ఇన్ పేషెంట్ విభాగాలను పరిశీలించిన కలెక్టర్ చికిత్స పొందుతున్న రోగులతో మాట్లాడి వారికి అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు.



వడదెబ్బతో చికిత్స పొందుతున్న రోగులను ప్రత్యేకంగా పరామర్శించి వారికి అందుతున్న వైద్య సదుపాయాలు, మందులు, పర్యవేక్షణపై సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అధిక ఉష్ణోగ్రతల నేపథ్యంలో వడదెబ్బ తగిలిన వారికి ఎప్పటికప్పుడు అందుబాటులో వైద్య సేవలు ఉండేలా ప్రత్యేక చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. అవసరమైన మందులు, ఐవీ ఫ్లూయిడ్స్, పడకలు అందుబాటులో ఉంచి అత్యవసర పరిస్థితులకు సిద్ధంగా ఉండాలని సూచించారు. రోగులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా నాణ్యమైన వైద్య సేవలు అందించాలని తెలిపారు.ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో వైద్యులు, సిబ్బంది తప్పనిసరిగా అందుబాటులో ఉండాలని, సమయపాలన పాటిస్తూ బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు .ఈ పరిశీలనలో తహసీల్దార్ ఉషారాణి, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## చెన్నారావు సేవా కార్యక్రమానికి తిరుమలకుంటలో అపూర్వ స్పందన

మేకార్తి దినపత్రిక

30 దైవాల ఘన ఊరేగింపుతో భక్తి పారవశ్యం దైవాలకు నీళ్లు అరబోసి, కొబ్బరికాయలు కొట్టి మొక్కులు చెల్లించిన భక్తులు :అశ్వారావుపేట మండలం తిరుమలకుంట గ్రామ పంచాయతీలో కొనా రోశయ్య, కొనాకళ్ల నాగయ్య, పామర్తి వెంకటరమణ, గొల్లపల్లి వెంకన్నబాబు గ్రామ ప్రజల సహకారంతో చెన్నారావు సేవా కార్యక్రమం అత్యంత వైభవంగా, భక్తి శ్రద్ధల నడుమ ఘనంగా జరిగింది. కార్యక్రమం విజయవంతం కావడానికి గ్రామ యువత, మహిళలు, పెద్దలు సమిష్టిగా కృషి చేశారు. చెన్నారావు సేవా కార్యక్రమం అత్యంత వైభవంగా, భక్తి శ్రద్ధల నడుమ ఘనంగా జరిగింది. గ్రామమంతా పండుగ వాతావరణం నెలకొనగా, చిన్నా పెద్దా తేడా లేకుండా ప్రజలు భారీ సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.ఈ సందర్భంగా ప్రత్యేక ఆకర్షణగా నిలిచిన 30 దైవాల ఊరేగింపు గ్రామ ప్రజలను విశేషంగా ఆకట్టుకుంది. డప్పుల మోగింపులు, భక్తి గీతాలు, హారతుల నడుమ దైవాలను గ్రామ వీధుల గుండా



ఊరేగించారు. దైవాలను ఊరేగిస్తూ వస్తుండగా భక్తులు ఎవరికి వారు దైవాలపై నీళ్లు అరబోసి, దన్నం పెట్టుకుని, కొబ్బరికాయలు కొట్టి నమస్కారం చేసుకుంటూ భక్తి భావాన్ని చాటుకున్నారు. గ్రామంలోని ప్రతి వీధిలో భక్తి పారవశ్యం కనిపించింది.సాయంత్రం వరకు కొనసాగిన ఈ ఊరేగింపులో మహిళలు, యువకులు, వృద్ధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం నైట్ వాలీబాల్ గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన ప్రత్యేక వేదికపై 30 దైవాలను ప్రతిష్ఠించి సుమారు రెండు గంటలపాటు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు పెద్ద ఎత్తున హాజరై సేవలను తిలకించి మొక్కులు చెల్లించుకున్నారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన మండల బీఆర్ఎస్ కీలక నాయకులు కాసాని చంద్రమోహన్, డా. భూక్యా ప్రసాద్ రావు సేవా కార్యక్రమ నిర్వాహకులను అభినందించారు. గ్రామ సంప్రదాయాలను యువత ముందుకు తీసుకెళ్తుండడం ఆనందంగా ఉందని పేర్కొన్నారు. తమ వంతు సహాయంగా చెరో రూ.5,000 ఆర్థిక సాయం అందజేసి సేవా కార్యక్రమానికి మద్దతు ప్రకటించారు.అలాగే బిర్రం వెంకటేశ్వరరావు బియ్యం విరాళంగా అందజేసి తన ఉదారతను చాటుకున్నారు. గ్రామ ప్రజల ఐక్యత, భక్తి భావం, సేవా తత్వం ఈ కార్యక్రమ విజయానికి కారణమని పలువురు అభిప్రాయపడ్డారు.ఈ కార్యక్రమంలో బొల్లుకొండ చెన్నారావు, సున్నం రామలక్ష్మయ్య, జుజ్జురి సత్యనారాయణ, పానుగంటి లక్ష్మణరావు, మాడి ముత్యాలరావు, మోడియం జగనద్దాం, కొనకళ్ల శ్రీనివాస్, మడకం ముత్యాలరావు, సిరిబోత్తుల సాంబయ్య, కొనకళ్ల రామలింగయ్య, పానుగంటి వీరభద్రం తదితరులు పాల్గొన్నారు. గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో విజయవంతం చేశారు.

## రాష్ట్ర మంత్రి వర్యులు సీతక్క గారి ఆదేశాల మేరకు జిల్లా అధ్యక్షులు పైడాకుల అశోక్ గారి సూచనల మేరక

గ్రామీణ ఉపాధి హామీ పనులను పరిశీలించి, ఎండల తీవ్ర స్థాయి దృష్టిలో ఉంచుకొని కూలీలకు మజ్జిగ పాకెట్లు, పెరుగు అరటిపండ్లు ఓఆర్ఎస్ ప్యాకెట్లు శీతలపానియాలు పంపిణీ చేసిన పంబాపూర్ సర్పంచ్ ముక్తి శ్రీనివాస్ గారు తేదీ:- 23.05.2026 శనివారం అనగా ఈరోజున తాడ్వాయి మండలం పంబాపూర్ గ్రామ పంచాయతీ పరిధిలో కొనసాగుతున్న మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పనులు సర్పంచ్ ముక్తి శ్రీనివాస్ ప్రత్యక్షంగా పరిశీలించారు..గత కొన్ని రోజులుగా మండుతున్న ఎండలు తీవ్రస్థాయిలో ఉండడంతో ఉపాధిహామీ పనులను హాజరువుతున్న కార్మికుల ఇబ్బంది దృష్టా వారి ఆరోగ్యం రీత్యా మజ్జిగ పెరుగు ఓఆర్ఎస్ ప్యాకెట్లు శీతలపానియలు పంపిణీ చేశారు డీ హైడ్రెషన్ సమస్యలు తలెత్తకుండా ఉండేందుకు ఇవి ఎంతో అవసరం అని కార్మికులకు అవగాహన కల్పించారు... అలాగే పనిచేసే ప్రదేశంలో చల్లని త్రాగునీరు సదుపాయం ఏర్పాటు చేయడంజరిగిందిగ్రామ



అభివృద్ధిలో ఉపాధిహామీ కార్మికుల పాత్ర ఎంతో ముఖ్యమని ఆయన అన్నారు.కార్మికులు భద్రతే మా బాధ్యత ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ పోలేబోయిన సమ్మక్క లక్ష్మీనారాయణ పంచాయతీ సెక్రటరీ భాస్కర్మాజీసర్పంచ్ కల్తీ నారాయణ నాగేశ్వరావు,వెంకటేష్,రాజేందర్కృ ష్ణ,ముక్తి రామారావు,రమేష్ పాల్గొన్నారు

# పెద్ది నుంచి హెల్లల్లల్లో.. సాంగ్ ప్రోమో విడుదల





మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ కథానాయకుడిగా తెరకెక్కుతున్న భారీ చిత్రం 'పెద్ది' పై రోజురోజుకీ అంచనాలు మరింత పెరుగుతున్నాయి. గ్రామీణ నేపథ్యంతో రూపొందుతున్న ఈ క్రీడా ప్రధాన కథా చిత్రం కోసం అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. దర్శకుడు బుచ్చిబాబు సానా తెరకెక్కిస్తున్న ఈ చిత్రానికి సంబంధించిన ప్రచార కార్యక్రమాలను చిత్రబృందం వేగవంతం చేసింది. రేపు భోపాల్‌లో భారీ స్థాయిలో సంగీత వేడుక జరగనున్న నేపథ్యంలో చిత్రబృందం అభిమానులకు సర్‌ప్రైజ్ ఇచ్చింది. సినిమాలోని ప్రత్యేక గీతం 'హెల్లల్లలో' అనే పాటకి సంబంధించిన ప్రోమో విడుదల చేశారు. ఇందులో రామ్ చరణ్, శృతి హాసన్ స్టెప్పులకి ఫ్యాన్స్‌కి మాంచి కిక్ ఇచ్చాయి. ఫుల్ సాంగ్ మార్చి 23న రానుంది. ఈ పాటకు ప్రముఖ గేయరచయిత అనంత శ్రీరామ్ సాహిత్యం అందించగా, ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందిన సంగీత దర్శకుడు ఏ.ఆర్. రెహమాన్ సంగీతాన్ని సమకూర్చారు. ఆయన సంగీతం అంటేనే ప్రేక్షకుల్లో ప్రత్యేకమైన ఆసక్తి ఉంటుంది. అందులోనూ ఇది ప్రత్యేక గీతం కావడంతో ఈ పాటపై భారీ అంచనాలు ఏర్పడ్డాయి. రేపు జరగనున్న సంగీత వేడుకలో ఈ పాటను అధికారికంగా విడుదల చేయనున్నారు. ఈ పాటలో ఇంకో కథానాయిక కూడా కనిపించనున్నట్లు సామాజిక మాధ్యమాల్లో చర్చ నడుస్తోంది. అయితే ఆమె ఎవరు అన్న విషయం మాత్రం చిత్రబృందం ఇంకా రహస్యంగానే ఉంచింది. దీంతో అభిమానుల్లో ఉత్కంఠ మరింత పెరిగింది. భారీ నిర్మాణ విలువలతో రూపొందుతున్న ఈ చిత్రం వచ్చే ఏడాది జూన్ 4న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. ఈ చిత్రంలో శివరాజ్ కుమార్, జగపతి బాబు, బొమన్ ఇరానీ, దివ్యేందు శర్మ తదితరులు ముఖ్య పాత్రల్లో నటిస్తున్నారు. ఈ చిత్రాన్ని వృద్ధి సినిమాస్ నిర్మిస్తుండగా, మైత్రీ మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్ సమర్పిస్తున్నాయి. ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్న ఈ చిత్రం ఇప్పుడు ప్రత్యేక గీతం వార్తతో మరింత చర్చనీయాంశంగా మారింది.

# కేన్స్ ఫిల్మ్ ఫెస్టివల్‌కు ఐశ్వర్యారాయ్



సందడిగా జరిగే కేన్స్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో ఐశ్వర్యారాయ్ ఎప్పుడూ హైలైట్‌గా నిలుస్తుంటారు. అయితే ఈసారి ఆమె ఈ వేడుకకు హాజరుకావడం లేదంటూ కొన్ని రోజులుగా సోషల్ మీడియాలో ప్రచారం జరిగింది. వీటికి చెక్ పెడుతూ ఈ బ్యూటీ తన కుమార్తెతో కలిసి ఫ్రాన్స్‌కు బయల్దేరారు. దీంతో కేన్స్‌లో చివరిరోజు ఐశ్వర్య సందడి చేయనున్నట్లు తెలుస్తోంది. ఒక ప్రముఖ బ్రాండ్ తరపున ప్రతి ఏటా కేన్స్ రెడ్ కార్పెట్‌పై హొయలొలికించే ఐశ్వర్య ఈసారి ప్రచార చిత్రాల్లో కనిపించకపోవడంతో రూమర్స్ మొదలయ్యాయి. ఆమెకు బదులుగా ఈసారి బాలీవుడ్ నటి అలియా వెళ్లారంటూ కథనాలు వచ్చాయి.దీంతో అభిమానులు తీవ్ర నిరాశకు గురయ్యారు. తాజాగా ఆమె ముంబయి ఎయిర్‌పోర్ట్‌లో కనిపించడంతో వాళ్లు సంబరపడుతున్నారు. ఈసారి ఈ కేన్స్ క్వీన్ ఎలాంటి లుక్స్‌తో మెస్మరైజ్ చేయనున్నారో అని అందరూ ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. మొదటిసారి 2002లో కేన్స్‌కు వెళ్లిన ఐష్.. అప్పటినుంచి ప్రతి ఏడాది తన ప్రత్యేకమైన దుస్తులతో మెరుస్తూనే ఉన్నారు. గతేడాది కూడా భారతీయత ఉట్టిపడేలా చీరతో వచ్చిన ఆమె.. నుదుటిన సింధూరంతో అందరి దృష్టిని ఆకర్షించారు. పహల్గాం దాడికి ప్రతీకారంగా భారత్ చేపట్టిన ఆపరేషన్ సిందూర్‌కు కేన్స్ వేదికగా తన లుక్‌తో మద్దతు ఇచ్చి సెంటర్ ఆఫ్ ఎట్రాక్షన్‌గా నిలిచారు.

# వినాయక చవితికి జైలర్-2 ?




'టైగర్ కా హుకుం'.. అంటూ ముత్తువేల్ పాండియన్‌గా మరోమారు బాక్సాఫీస్ బరిలో సందడి చేయనున్నారు కథానాయకుడు రజనీకాంత్. ఆయన 'జైలర్'లో ఇదే పాత్రతో అందర్నీ అలరించిన సంగతి తెలిసిందే. ఇప్పుడీ విజయవంతమైన సినిమాకి కొనసాగింపుగా 'జైలర్ 2' సిద్ధమైంది. నెల్సన్ దిలీప్ కుమార్ తెరకెక్కించిన ఈ పాన్ ఇండియా చిత్రాన్ని సన్‌పిక్చర్స్ సంస్థ నిర్మించింది. మోహన్‌లాల్, శివ రాజ్‌కుమార్ తదితరులు ప్రత్యేక పాత్రలు పోషించారు. ఇప్పటికే చిత్రీకరణ పూర్తి చేసుకున్న ఈ సినిమాని వినాయక చవితి సందర్భంగా సెప్టెంబరు రెండో వారంలో విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు సమాచారం. దీని కోసం రెండు తేదీల్ని పరిశీలిస్తున్నట్లు తెలిసింది. దీనికి తగ్గట్లే ప్రస్తుతం నిర్మాణానంతర పనుల్ని వేగవంతం చేసినట్లు తెలుస్తోంది. త్వరలోనే విడుదల తేదీపై అధికారిక ప్రకటన వెలువడే అవకాశముంది. ఈ యాక్షన్ థ్రిల్లర్ చిత్రానికి అనిరుధ్ సంగీతమందిస్తుండగా.. విజయ్ కార్తిక్ కన్నన్ ఛాయాగ్రాహకుడిగా వ్యవహరించారు.

# ఎప్పుడూ అదే పక్షపాత ధోరణి

కథానాయకులు ప్రధాన పాత్రలు పోషించే చిత్రాలకు లభించే బడ్జెట్‌లు, మద్దతు లాంటివి నాయికా ప్రాధాన్య ప్రాజెక్టులకు దొరకవంటోంది బాలీవుడ్ నటి హ్యూమా ఖురేషీ. ఇటీవలే కేన్స్ చిత్రోత్సవంలో పాల్గొన్నారీమె. ఈ నేపథ్యంలో ఓ ఇంటర్వ్యూలో చిత్రపరిశ్రమ గురించి మాట్లాడారు. "మనది చాలా వైవిధ్యమైన దేశం. మనదైన శైలిలో మహిళా ప్రాధాన్య కథలను రూపొందించడానికి చాలా అవకాశాలు ఉన్నాయి. ఎలాంటి రీమేక్‌లు చేయకుండా.. ఒరిజినల్ కంటెంట్‌ను రూపొందించాలి. మన పురాణాలు, సంస్కృతులపై కూడా దృష్టిపెడతారని ఆశిస్తున్నా. హీరోలకు లభించే బడ్జెట్‌లు మాకు లభించవు. మహిళా చిత్రాలకు బాక్సాఫీస్ వద్ద ఒక నిర్దిష్ట సామర్థ్యం మాత్రమే ఉంటుందనే పక్షపాత ధోరణి ఇండస్ట్రీలో ఎప్పుడూ ఉంటుంది. ఈ రోజుల్లో కూడా అలా ఉంటుందా అంటే బహుశా దాని గురించి ఎవరూ అంతగా మాట్లాడకపోయి ఉండొచ్చు. అంతేకానీ, లేదని మాత్రం కాదు. ప్రస్తుతం నేను కూడా ఇదే సమస్యను ఎదుర్కొంటున్నాను. ఇది నిరంతరం ఎదుర్కోవాల్సినదే. దానిని అధిగమించడానికి ఏకైక మార్గం ముందుకు సాగిపోతూ పని చేస్తూ ఉండడమే. నేను మాత్రమే కాదు నా తోటి నటీమణులు చాలా మంది.. తమ కెరీర్‌లో తమ కోసమే కాకుండా భవిష్యత్తులో తమ తర్వాత వచ్చే అనేక మంది కోసం వాస్తవ పరిస్థితిని మార్చడానికి నిరంతరం కృషి చేస్తూ ఆ పరిమితులను దాటుతున్నారనే భావిస్తున్నాన"ని అన్నారు. హ్యూమా ప్రస్తుతం యశ్ హీరోగా గీతూ మోహన్‌దాస్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న 'టాక్సిక్' చిత్రంలో నటిస్తోంది.






# ఓటిటిలోకి మోహన్ లాల్, మమ్ముట్టిల పేట్రియాట్

మలయాళ చిత్ర పరిశ్రమకు చెందిన ఇద్దరు అగ్ర కథానాయకులు మమ్ముట్టి, మోహన్‌లాల్ కలిసి నటించిన భారీ మల్టీస్టారర్ స్పై యాక్షన్ థ్రిల్లర్ 'పేట్రియాట్' ఓటీటీ విడుదల తేదీ ఖరారైంది. మహేష్ నారాయణన్ దర్శకత్వంలో పొలిటికల్ అండ్ స్పై థ్రిల్లర్‌గా తెరకెక్కిన ఈ చిత్రం దేశవ్యాప్తంగా భారీ అంచనాల మధ్య థియేటర్లలో విడుదలై ప్రేక్షకులను ఆకట్టుకుంది. ఈ క్రమంలోనే థియేటర్లలో విడుదలైన కొన్ని వారాలకే ఈ సినిమా డిజిటల్ ప్రీమియర్‌కు సిద్ధమైంది. ప్రముఖ ఓటీటీ ప్లాట్‌ఫారమ్ జీ5 ఈ చిత్రం డిజిటల్ స్ట్రీమింగ్ హక్కులను సొంతం చేసుకోగా.. జూన్ 5 నుంచి ఈ సినిమాను డిజిటల్ ఎ÷–లాట్‌ఫారమ్‌లో అందుబాటులోకి తీసుకురానున్నట్లు జీ5 వెల్లడించింది. మలయాళంతో పాటు తెలుగు, తమిళం, కన్నడ, హిందీ భాషల్లో కూడా ఈ చిత్రం ఒకేసారి స్ట్రీమింగ్ కానుంది. మమ్ముట్టి, మోహన్‌లాల్ చాలా కాలం తర్వాత స్క్రీన్ షేర్ చేసుకోవడం ఈ సినిమాకు ప్రధాన ఆకర్షణగా నిలవగా, ఇందులో ఫహాద్ ఫాజిల్ ప్రధాన విలన్ పాత్రలో నటించారు. నయనతార, కుంచాకో బోబన్, రేవతి వంటి భారీ తారాగణం కీలక పాత్రలు పోషించారు. నేషనల్ సెక్యూరిటీ, ప్రభుత్వ నిఘా నెట్‌వర్క్ మరియు అంతర్జాతీయ కుట్రల చుట్టూ సాగే ఈ హై-వోల్టేజ్ యాక్షన్ డ్రామాను థియేటర్లలో మిస్ అయిన వారు జూన్ 5 నుండి జీ5లో వీక్షించవచ్చు.

# సూర్య కరుప్పు.. రికార్డు కలెక్షన్లు




కోలీవుడ్ స్టార్ హీరో సూర్య అభిమానులు ఎన్నో రోజులుగా ఎదురుచూస్తున్న భారీ కంబ్యాక్ ఎట్టకేలకు నిజమైంది. గత కొంతకాలంగా సరైన కమర్షియల్ బ్లాక్‌బస్టర్ కోసం ఎదురుచూస్తున్న సూర్యకు తాజాగా వచ్చిన 'కరుప్పు' చిత్రం ఆ లోటును పూర్తిగా తీర్చేసినట్టు కనిపిస్తోంది. తెలుగులో 'వీర భద్రుడు' పేరుతో విడుదలైన ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద అద్భుతమైన వసూళ్లతో దూసుకుపోతోంది. విడుదలైన మొదటి వారం ముగిసేలోపే ఈ సినిమా రికార్డు స్థాయి కలెక్షన్లు సాధించి ట్రేడ్ వర్గాలను ఆశ్చర్యానికి గురి చేసింది. సాధారణంగా పెద్ద సినిమాలు మొదటి వారంలో భారీ వసూళ్లు నమోదు చేయడం కొత్త విషయం కాదు. కానీ 'కరుప్పు' సాధించిన నంబర్లు మాత్రం ఇప్పుడు కోలీవుడ్‌లో హాట్ టాపిక్‌గా మారాయి. ట్రేడ్ వర్గాల సమాచారం ప్రకారం ఈ చిత్రం కేవలం ఏడు రోజుల్లోనే ప్రపంచవ్యాప్తంగా రూ.200 కోట్ల మార్క్‌ను దాటేసి మొత్తం రూ.207 కోట్ల గ్రాస్ వసూలు చేసింది. దీంతో ఇది సూర్య కెరీర్‌లో ఇప్పటివరకు వచ్చిన చిత్రాల్లో అత్యంత వేగంగా భారీ వసూళ్లు సాధించిన సినిమాగా నిలిచిందని సినీ వర్గాలు చెబుతున్నాయి. ఇప్పటివరకు సూర్య కెరీర్‌లో ఎన్నో హిట్ చిత్రాలు వచ్చినా, ఈ స్థాయిలో భారీ ఓపెనింగ్స్‌తో పాటు స్థిరమైన వసూళ్లు రావడం అభిమానులను మరింత ఆనందంలో ముంచెత్తుతోంది. ముఖ్యంగా తమిళనాడులో సినిమా అద్భుతమైన రన్ కొనసాగిస్తుండగా, తెలుగు రాష్ట్రాలు, కర్ణాటక, కేరళతో పాటు ఓవర్సీస్ మార్కెట్లలో కూడా మంచి స్పందన లభిస్తోంది. వీకెండ్ తర్వాత కూడా వసూళ్లు బలంగా కొనసాగడం సినిమాకు ఉన్న బలమైన మౌత్ టాక్‌ను సూచిస్తోంది. ఇప్పుడు ట్రేడ్ విశ్లేషకుల దృష్టి మొత్తం సినిమా తదుపరి లక్ష్యంపై పడింది. ప్రస్తుతం 'కరుప్పు' రూ.300 కోట్ల గ్రాస్ మార్క్ వైపు దూసుకెళ్తోందని వారు అంచనా వేస్తున్నారు. ఇదే స్పీడ్ కొనసాగితే సూర్య కెరీర్‌లోనే కాదు, కోలీవుడ్‌లో కూడా మరో భారీ గ్రాసర్‌గా ఈ చిత్రం చరిత్ర సృష్టించే అవకాశం ఉందని చెబుతున్నారు. ఈ చిత్రానికి దర్శకుడు ఆర్జే బాలాజీ దర్శకత్వం వహించగా, సంగీత దర్శకుడు సాయి అభ్యంకర్ సంగీతం అందించారు.

PRINTED,PUBLISHED & OWNED BY MEKARTHI SRINIVAS, Printed at SUNDAY PRINTING PRESS, H.No. 3-4297, SARASWATHI COMPLEX,SVN COLONY GUNTUR,ANDHRA PRADESH-522006.& Published from H.No. 12-166, RAJIV NAGAR,MUSTABAD, RAJANNA SIRICILLA DISTRICT-505404 TELANAGNA,.
RNI No.TGTEL /25/A2356,Editor : MEKARTHI SRINIVAS, Cell: 9014726022.e-mail: MEKARTHI DINAPATRIKA@gmail.com